ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5 శనివారం 25 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 ‌ । కనిష్ఠం 17.0



చిట్యాల మండలం పేరేపల్లిలో గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు ఉమ్మడి జిల్లా ప్రజల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామ, వార్డు సభలు శుక్రవారంతో ముగిశాయి. కాగా, ఈ సభల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.69లక్షల దరఖాస్తులు రాగా, అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1.08లక్షలు, రేషన్ కార్డుల కోసం 1.05లక్షల దరఖాస్తులు వచ్చాయి.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట కలెక్టరేట్)

ఇల్లు కావాలి

- ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 1.08లక్షల దరఖాస్తులు
- రేషన్ కార్డుల కోసం 1.05లక్షలు
- మొత్తం 2.69లక్షల దరఖాస్తులు
- ముగిసిన గ్రామ సభలు
- పలుచోట్ల ఆందోళనలు, నిరసనలు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్వహించిన ప్రజాపాలనలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదే విధంగా ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా కూడా అర్హుల జాబితాను రూపొందించారు.అయితే గ్రామ సభల్లో ప్రకటించిన అర్హుల జాబితాలో పేర్లు లేవని పలు గ్రామాలు, వార్డుల్లో ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు స్పష్టంచేయగా, ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.69లక్షల దరఖాస్తులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,745 పంచాయతీలు, 19 మునిసిపాలిటీల్లో 427 వార్డులు ఉన్నాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి మొత్తం 2,69,295 దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,08,012 దరఖాస్తులు, రేషన్ కార్డుల కోసం 1,05,691, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 49,222, రైతు భరోసా కోసం 6,370 దరఖాస్తులు వచ్చాయి. సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు, ఐదు మునిసిపాలిటీ ల పరిధిలోని 141 వార్డులు ఉన్నాయి. గ్రామ సభల్లో కొత్తగా 77,037 దరఖాస్తులు వచ్చాయి. రైతు భరోసా కోసం 2,828 మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 22,186 మంది, రేషన్‌కార్డుల కోసం 23,798మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28,225 మంది దరఖా స్తు చేశారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో కూడా పలువురు దరఖాస్తు చేసుకోగా, అందులో కొంతమందిని మాత్రమే అధికారులు అర్హులుగా గుర్తించారు.

పలు గ్రామాలు, వార్డుల్లో ఆందోళనలు

ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో పలు చోట్ల ప్రజలు ఆందోళనకు దిగారు. సభల్లో అధికారులు ప్రకటించిన జాబితాలో పేర్లు లేవని నిరసన తెలిపారు. అర్హులు కానీ వారి పేర్లు జాబితాలో ఉన్నాయని నిలదీశారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు రాకుండా చేస్తున్నారని వాపోయారు. దీంతో పలు చోట్ల గ్రామ, వార్డు సభలు వాడివేడిగా సాగాయి.



గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు

సూర్యాపేట: నిరుపేదలు ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలన సభల సమయంలో భారీగా దరఖాస్తు లు ఇచ్చారు. ఒక్క సూర్యాపేట జిల్లాలో 5,135 దరఖాస్తులు రాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20వేల లోపు దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. గతంలో సూర్యాపేట జిల్లాకు 5,424 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా, 3,086 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇవి చాలాకాలంగా వాడకంలో లేక కిటికీలు, అద్దాలు, విద్యుత్ వైరింగ్ ధ్వంసమైంది. గతంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో సైతం ఇందిరమ్మ కాలనీలు 1, 2, 3 ఏర్పాటు చేసి 80 గజాల చొప్పున స్థలాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు వారికున్న స్థోమ త ఆధారంగా ఇళ్లను నిర్మించుకున్నారు. కొంత మంది నేటికీ ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. అయితే వారికి ప్రస్తుతం స్థలం ఉన్నందున ఆర్థిక సహాయం అందించాలని ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. అందులో మునిసిపాలిటీలకు పెద్ద మొత్తంలో కేటాయించనున్నారు. తొలి విడతలో స్థలం ఉన్న వారికి రూ.5లక్షల నిధులు కేటాయిస్తారు. స్థలం లేనివారికి ప్రభుత్వం రెండో విడతలో స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు

- మిగతా 7వ పేజీలో...

జిల్లా	రేషన్ కార్డులు	ఇందిరమ్మ ఇళ్లు	ఆత్మీయ భరోసా	రైతు భరోసా	మొత్తం
నల్లగొండ	53,844	47,471	15,485	844	1,17,644
సూర్యాపేట	23,798	28,225	22,186	2,828	77,037
యాదాద్రి	28,049	32,316	11,551	2,698	74,614
మొత్తం	1,05,691	1,08,012	49,222	6,370	2,69,295



కందిపోతోన్న ధర

- కందులకు దక్కని మద్దతు ధర
- మార్కెట్‌కు వచ్చే క్రమంలో తగ్గిన ధర
- మద్దతు ధర రూ.7,550.. రూ.6వేలకు మించని వైనం

నల్లగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతిప్రతిని ధి): పప్పు ధాన్యాలకు మద్దతు ధర కరువైంది. కందుల కొనుగోళ్లలో వ్యాపారులు చెప్పిందే ధరగా చెలామణి అవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దిగుబడి తక్కువగా ఉండడం, సీజన్‌కు ముందు కనీస మద్దతు ధరకంటే ఎక్కువ ధర బహిరంగ మార్కెట్లో లభిస్తే, రైతుల నుంచి కందులు మార్కెట్‌కు రావడం మొదలయ్యాక వ్యాపారులు ధర తగ్గించేశారు. ఉత్పత్తి తక్కువగా ఉండడం, బహిరంగ మార్కెట్లో మద్దతు ధరకు మించి ధర లభిస్తున్న క్రమంలో మార్క్‌ఫెడ్ సైతం కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేయడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు జరగలేదు. మరోవైపు నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో కందులకు మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు నష్టపోతున్న పరిస్థితి నెలకొంది.

వ్యాపారులు ధర తగ్గించడంతో రైతుల బేజార్

కందులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550 కాగా, ప్రస్తుతం ఒక్క సూర్యాపేట మార్కెట్లో మాత్రమే క్వింటాల్‌కు కనీస మద్దతు ధరకు సరిసమానంగా ధర లభిస్తుంటే, నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లోని నల్లగొండ, హాలియా, నకిరేకల్, భువనగిరి, ఆలేరు, మోత్కూరులో ధర క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6వేలకు లోబడి మాత్రమే లభిస్తోంది. సూర్యాపేటలో మార్క్‌ఫెడ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు, ఎగుమతిదారులు సైతం ఇక్కడ కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో ఈ మార్కెట్లో ధర లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో కందుల కల్లాలు ముగిసి విక్రయానికి కందులు వస్తున్న తరుణంలో ధర లేకపోవడంతో రైతులకు పెట్టుబడులు సైతం దక్కని దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 10,326 ఎకరాల్లో కంది సాగుచేయగా, 48,020 క్వింటాళ్ల కందుల ఉత్పత్తి వస్తుందని అంచనావేశారు. కంది పంటను వానాకాలం సాగులో పత్తిలో అంతరపంటగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికంగా సాగవడంతో పాటు, ప్రత్యేకంగా కంది సాగు కూడా ఈ దఫా అత్యధికంగా సాగయింది. వ్యవసాయశాఖ నమోదులో కేవలం ప్రత్యేక సాగునే పేర్కొనడం, దిగుబడులు సైతం గరిష్ఠంగా నాలుగు క్వింటాళ్లే నమోదు చేయడంతో వాస్తవ ఉత్పత్తి అంతకు మించి వచ్చిందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారుల అంచనా ప్రకారం వచ్చే 48,020 క్వింటాళ్లు అయితే, వాస్తవానికి ఇంతకు రెట్టింపుగా ఉత్పత్తి వచ్చిందని, దీనిని అధికారులు అంచనా వేయలేకపోవడంతోనే మార్కెట్లో రైతులకు విక్రయాలకు ఇబ్బంది ఎదురవుతుందని చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి ఇప్పటికైనా రైతులకు..

- మిగతా 6వ పేజీలో...



నల్లగొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి, చిత్రంలో కంచర్ల

సీఎం దావోస్ పర్యటన విఫలం

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి •7లో..

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

టీఆర్‌వీకేఎస్ అధ్యక్షుడు కరెంట్‌రావు



రిలే దీక్షలో మాట్లాడుతున్న కరెంట్‌రావు

నల్లగొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లోకి మార్చాలని తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.కరెంట్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై జేఏసీ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులు పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎప్పటికైనా రెగ్యులర్ అవుతారనే ఆశతో అరకొర వేతనాలతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారని అన్నారు. ఆర్టిజన్లు కార్మికులుగా గుర్తింపబడినప్పటి నుంచి ఇప్పటివరకు పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతలను బట్టి ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 20వేల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎస్‌వీ.రావు, జంజిరాల వెంకన్న, గండమల్ల రాములు, మైనం ఊషయ్య, సందీప్ రెడ్డి, ఎం.రవి, మల్లేష్, నిర్మల, పెరిక శేఖర్, పెరుమళ్ల మురళి, జిట్టబోయిన లింగస్వామి, పోతేపాక విజయ్, లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, యూనీస్, జబ్బర్, ప్రవీణ్, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వింజమూర్ పల్లెదవాఖానను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ అమీనా, యాస్మీన్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు చదివితే ఏదైనా సాధ్యం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దుగ్యాల ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదవితే ఏదైనా సాధ్యమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. 'బేటీ బచావో, బేటీ పడావో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆడపిల్లలు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చదువుతో కలిగే లాభాలేంటో విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాతీయ బాలికా దినోత్సవం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భ్రూణ హత్యలను నివారించడం, బాలికా విద్యను ప్రోత్సహించడం, మహిళా సాధికారత దిశగా అవగాహన కార్యక్రమాలు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్చి 8వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి మాట్లాడుతూ అమ్మాయిలపై వివక్ష చూపకుండా అన్ని రంగాల్లో సమానంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చింత కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి కృష్ణవేణి, జువైనల్ జస్టిస్ బోర్డు మెంబర్ మోహన్ రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ వెంకన్న, గర్ల్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి సరిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి): విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండలంలోని దుగ్యాలలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, హాస్టల్‌లో రూ.3.80లక్షల విలువైన రెండు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను, రూ.60లక్షలతో జంగిల్ క్లీనింగ్ పనులను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెండు నెలల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు మెరుగైన విద్యాబోధనకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి, మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నెర్మటి సతీష్‌రెడ్డి, తేరా సత్యనారాయణరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు పారదర్శకంగా అర్హుల ఎంపిక జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, మరిన్ని పథకాలు కూడా అమలుచేయనుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి, ఎంపీడీవో బాలరాజురెడ్డి, నాయకులు ఎంఏ.సిరాజ్‌ఖాన్, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, గంధం సురేష్, బక్కులు, మల్లేష్‌యాదవ్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ గ్రీవెన్స్

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్‌రావు



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న నాగేశ్వర్‌రావు

నల్లగొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ గ్రీవెన్స్ చక్కని వేదిక అని కన్స్యూమర్ గ్రీవెన్స్‌సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ పి. నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌లో వినియోగదారుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులు అపరిష్కృత సమస్యలపై ఫిర్యాదుచేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో ప్రతీ మూడు నెలలకు ఒకసారి గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఫైనాన్స్ రామాంజనాయక్, ఇండిపెండెంట్ మెంబర్ వెంకట ఎస్.కె.కె, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ అన్నయ్య, టెక్నికల్ ఏడీ నవీద్ అహ్మద్ పాల్గొన్నారు.

టెంటు పీకేసి, అధికారులను నిలదీసి

గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి నిరసన వెల్లువ •6లో..

చక్కదిద్దితే చూడముచ్చట

- ఉమ్మడి జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలు
- సినిమా చిత్రీకరణకు నెలవుగా రాచకొండ
- రాజుల వైభవానికి తార్కాణంగా దేవరకొండ ఖిల్లా, వాడపల్లి

•6లో..

దేవరకొండ రాళ్లతో తాజ్‌మహల్‌కు సొబగులు

- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



ఓటరూ.. శాసించు

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం •7లో..

చక్కదిద్దితే చూడముచ్చట...

● ఉమ్మడి జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలు ● సినిమా చిత్రీకరణకు నెలవుగా రాచకొండ ● రాజుల వైభవానికి తార్కాణంగా దేవరకొండ ఖిల్లా, వాడపల్లి

ప్రకృతి అందాలకు నిలయంగా, చారిత్రక సంపదకు కొలమానంగా, ఆధ్యాత్మికతకు ఆలవాలంగా నిలుస్తున్నాయి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాలు.. నిత్యం పర్యాటకులతో సందడి చేసే ఈ ప్రాంతాల్లో రాతియుగం నాటి ఆనవాళ్లు, అద్భుత కట్టడాలు, కోట బురుజులు, విశేషమైన ఆలయాలూ ఉన్నాయి. ఒక్కో ప్రాంతానిదీ ఒక్కో చరిత్ర, ఒక్కో ప్రాంతంలో చేసే పర్యటన ఎన్నో మధురానుభూతులను మిగులుస్తుంటాయి. అలాంటి ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి పర్యాటకుల మనస్సు దోచేలా చారిత్రక సంపదను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకనాటి ఓడరేవు.. వాడపల్లి

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

నదీ సంగమం, ప్రకృతి సోయగం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి సంగమం. నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం ఒకనాడు ఓడ పల్లి. ఓడల రేవు కేంద్రం. ఏడు కోటలు, ఏడు పేటలు, అగస్త్యపురం, నర్సింహపురం, వీరభద్ర పురం అనేమూడు పురాలుగా విరాజిల్లి ఓడల ద్వారా అంతర్జాతీయ వర్తకాలు సాగించిన వాడ పల్లి అత్యంత ప్రాశస్త్యం కలిగిన ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి. ఓ వైపు కృష్ణా, మరో వైపు మూసీనది ప్రవాహలతో రెండు వైపుల నీరుండి మూడోవైపు దారి ఉన్న ప్రాంతంగా, సురక్షిత ప్రదేశంగా గుర్తించి 600 ఏళ్లకు పూర్వమే రెడ్డి రాజులు ఇక్కడ కోటలు నిర్మించడంతో పాటు నీటి లభ్యత ఉన్నందున ఇళ్లు కూడా నిర్మించు కున్నారు. వారి కాలంలో నిర్మించిన మీనాక్షి అగస్తేశ్వరా, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు గొప్ప చారిత్రక ఆధ్యాత్మిక క్షేత్రాలుగా భాసిల్లుతున్నాయి. ఇక్కడికి నిత్యం పర్యాటకులు, భక్తులు వస్తుంటారు. ఈ ప్రాంతానికి 12 కిలోమీటర్ల దూరంలోనే నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పూర్తయి ఉత్పత్తి ప్రారంభిస్తే వాడపల్లికి పర్యాటకుల తాకిడి మరింతగా పెరిగే అవకాశం వుంది.



వాడపల్లిలోని వందల ఏళ్ల కిందట నిర్మించిన ప్రవేశద్వారాలు

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



వాడపల్లిలో రెడ్డిరాజుల కాలంలోని కోటల, గోడల నిర్మాణ శైలి ఎంతో ఆకట్టుకుంది. వందలఏళ్లు గడిచినా వాటి సౌందర్యం అబ్బురపరుస్తూనే ఉంటుంది. వాడపల్లిని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. బోటింగ్, పార్క్‌ను ఏర్పాటు చేయాలి. యాత్రికులకు వసతలు కల్పించాలి.

ఈగ సైదారావు, దామరచర్ల.



(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్)

'రాచకొండ' రాష్ట్రంలో ఈ ప్రాంతం పేరు తెలియని వారు దాదాపుగా ఉండరు. రాజుల కాలంలో రాజధానిగా విలసిల్లిన ఈ ప్రాంతం ఆ తర్వాత సాయుధపోరాటానికి బాసటగా నిలిచింది. యాదాద్రి భువనగిరి జిల్లా రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో రాచకొండ ప్రాంతం సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ ప్రాంతం ప్రకృతి అందాలకు చారిత్రక కట్టడాలకు నిలయంగా ఉంది. రేచర్ల పద్మనాయకుల కాలంలో నిర్మించిన ఎత్తయిన కోటలు, కట్టడాలు, దేవాలయాలు నేటికీ అప్పటి వైభవాన్ని ప్రదర్శిస్తున్నాయి. పచ్చని సెలయేర్లు జలపాతాలతో ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎత్తయిన కొండపైన ఉన్న సంకండ్ల బావి రాచకొండకు ప్రత్యేక ఆకర్షణ. రాచకొండ గుట్టలలో పదుల సంఖ్యలో దేవాలయాలు ఉన్నాయి. నిత్యం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహిస్తుంటారు. సెలవు రోజుల్లో వివిధ ప్రాంతాలకు చెందిన పెద్దసంఖ్యలో పర్యాటకులు రాచకొండను సందర్శిస్తున్నారు. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న రాచకొండ గుట్టలను అన్నిరంగాలలో అభివృద్ధి చేయాల్సి ఉంది. గతంలో రాచకొండలో ఫిలిం సిటీ ఏర్పాటుకు చేస్తామని పాలకులు ప్రకటించారు. దశాబ్దకాలం గడిచినా నేటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఫిలిం సిటీ ఏర్పాటుతో పాటు పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.







(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నకిరేకల్ నియోజకవర్గంలో రామన్నపేట మండలం నుంచి కేతేపల్లి వరకు మూసీ ప్రవహిస్తోంది. మూసీ నది ప్రక్షాళనను చేపడితే ఈ ప్రాం తాలు కూడా పర్యాటకకేంద్రాలుగా అభివృద్ధి చెందనున్నాయి. మత్స్యకారులకు ఉపాధి వనరుగానే కాకుండా మూసీ పరివాహకాల్లో అందమైన ప్రకృతి ఆహ్లాదపరిచే వాతావరణం ఉన్న ప్రదేశాల్లో చిల్డ్రన్స్ పార్కులు, బోటు షికారు చేసే పర్యాటక వసతులను కల్పిస్తే సందర్శకుల సందడితో కొత్త పర్యాటక కేంద్రంగా మూసీ పరివాహకం కూడా పర్యాటక జాబితాలో చేరనుంది.

● నార్కట్‌పల్లి మండలంలో ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, ఇటీవలే జాతికి అంకితమైన బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం రిజర్వాయర్, జాతీయ రహదారిపై గోపలాయపల్లి శివారులోని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానాలు ఉన్నాయి. చెర్వుగట్టు క్షేత్రాన్ని ప్రతీ రోజూ పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే ఈ క్షేత్రాన్ని మాస్టర్‌ప్లాన్‌తో అభివృద్ధి చేస్తే పర్యాటక, యాత్రాస్థలంగా మరింత ప్రాచుర్యం పొందనుంది. యాదగిరిగుట్ట దేవస్థానంలో మాదిరిగానే చెర్వుగట్టుకు కూడా గిరిప్రదక్షిణ చేసే అవకాశాన్ని కల్పిస్తే భక్తులు మరింత పెరిగే అవకాశముంది.

● బీ.వెల్లెంల రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. ఉదయసముద్రం రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎకో పార్కును ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు మంత్రులు సూచనప్రాయంగా తెలిపారు.





దేవరకొండ రాళ్లతో తాజ్‌మహల్‌కు సొబగులు

తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెక్కడ అన్న శ్రీశ్రీ మాటలే విన్నాం, కానీ ఆ రాళ్లు మన జిల్లావే అని ఎంతమందికి తెలుసు. తాజ్‌మహల్ సొబగులకు నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతానికి చెందిన క్రిస్టల్ క్వార్జ్ రాళ్లు(పలుగురాళ్లు) వాడినట్లు ఇటీవల పరిశోధనలో వెలుగుచూసింది. దీంతో మరోసారి దేవరకొండ ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. కాలిఫోర్నియాలోని జెమోలాజికల్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్ నుంచి రిటైర్డ్ లైబ్రేరియన్ డిర్లాం ఇటీవల చేసిన అధ్యాయనంలో పాలరాతితో కట్టిన తాజ్‌మహల్ రాళ్లను దేవరకొండ ప్రాంతం నుంచి సేకరించినట్లుగా గుర్తించారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

దేవరకొండ డివిజన్‌లో పలుగురాళ్ల గుట్టలు ఉన్నాయి. విలువైన ఈ రాళ్లను ఇక్కడి నుంచి తరలించి మొగల్ వంశీయులు తాజ్‌మహల్ నిర్మాణాన్ని చేపట్టినట్లు చరిత్ర చెబుతోంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో పలుగురాళ్లను తాజ్‌మహల్ నిర్మాణానికి ఉపయోగించినట్లు తెలుస్తోంది. తాజ్‌మహల్ నిర్మాణంలో ఈ ప్రాంత పలుగురాళ్లు ఉపయోగించారని వెలుగులోకి రావడంతో దేవరకొండ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో విశేషాల నెలవు దేవరకొండ ఖిల్లా

13వ శతాబ్దంలో నిర్మితమైన దేవరకొండ ఖిల్లాకు చుట్టు ఎనిమిది చోట్ల ఆంజనేయ స్వామి రూపాన్ని చెక్కి కోటను అష్టదిగ్బంధం చేశారు. కోట చుట్టు 370 బురుజులు, మట్టి రాళ్లతో కట్టిన గోడలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఏడు గుట్టలను చుట్టుకొని ఉన్న కోట ప్రాంగణంలో 500 బురుజులు, రాతితో కట్టిన 32 ప్రాకార ద్వారాలు, 9 ప్రధాన ద్వారాలు, 25 పెద్దబావులు, 40 దిగుడుబావులు, కోనేర్లు, సభావేదికలు, ధాన్యాగారాలు, సైనిక నివాసాలు, ఆలయాలు ఎన్నో ఉన్నాయి. ప్రతి శివరాత్రికి, ఏకాదశికి దేవరకొండ ఖిల్లాలో ఉత్సవాలు జరుపుతారు. గత ప్రభుత్వం రూ.5 కోట్లతో ఐదు ఎకరాల్లో ఖిల్లాలో పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల ఈ పార్క్‌ఉ పర్యాటకుల రద్దీ పెరిగింది. దేవరకొండ ఖిల్లా సందర్శనకు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలు విద్యాసంస్థల విద్యార్థులు సందర్శనకు వస్తున్నారు. విదేశీ పర్యాటకుల రద్దీ కూడా ఇటీవల పెరిగింది. చారిత్రక సంపదను కాపాడటంతో పాటు ఎకో పార్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సిరి సంపదలకు నిలయం



దేవరకొండ సిరిసంపదలకు నిలయం. దేవతల కొండగా దేవరకొండ కోటకు సుదీర్ఘ చరిత్ర ఉంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రకృతి సంపద, నిక్షేపాలు ఉన్నాయి. ప్రభుత్వం నిక్షేపాలు, సంపదను ఉపయోగించుకోవాలి. దేవరకొండ ఖిల్లాతో పాటు దేవరచర్లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

తాటిశెట్టి నర్సింహ, రిటైర్డ్ హెచ్‌ఎం, రాష్ట్రపతి అవార్డు గ్రహీత

పర్యాటక అభివృద్ధికి కృషి



దేవరకొండ ఖిల్లా, దేవరచర్లశివాలయం చారిత్రక కట్టడాలు. తాజ్‌మహల్ నిర్మాణంలో దేవరకొండ పలుగురాయిని ఉపయోగించారని వెలుగులోకి రావడం మంచి పరిణామం. దేవరకొండ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ముందుకు వెళ్తున్నా

బాలునాయక్, ఎమ్మెల్యే, దేవరకొండ

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దవూర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పొట్టిచెలిమ వద్ద శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని మగ వ్యక్తి కొన్నేళ్లుగా మండలంలోని సమ్మక్క సారక్క స్టేజి నుంచి బెట్టితండావరకు మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. శుక్రవారం ఉదయం మండలంలోని పొట్టిచెలిమ వద్ద గల అటవీ ప్రాంతంలో హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు వెళ్లే రహదారి పక్కన కొంతదూరంలో ఆహారం లేక చలితీవ్రతకు తట్టుకోలేక చనిపోయినట్లు భావిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తుపడితే 8712670198 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ఇటుకబట్టీలో పనిచేస్తున్న బాలకార్మికులకు విముక్తి

మిర్యాలగూడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇటుక బట్టీలో పనిచేస్తున్న నలుగురు బాలకార్మికులకు అధికారులకు విముక్తి కలిగించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ శివారులోని గూడూరు గ్రామశివారులో ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన కార్మికుల పిల్లలు నలుగురు పనిచేస్తున్నట్లు వీడియో ద్వారా అందిన ఫిర్యాదు మేరకు సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖరరాజు ఇతర అధికారులు తనిఖీలుచేశారు. ఇటుక బట్టీలకు నాలా, ఎన్వోసీ తదితర అనుమతులు లేవని గుర్తించారు. అక్కడ పనిచేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన కూలీలకు బాత్రూం, కరెంటు లాంటి కనీస సౌకర్యాలు కూడా లేనట్లు అధికారులు గుర్తించారు. కార్మికులతో కరెంటు వెలుగుల్లో రాత్రి సమయాల్లో కూడా పని చేయిస్తూ అతి తక్కువగా కూలీ ఇస్తున్నట్లు విచారణలో తెలుసుకున్నారు. బట్టీ పనులతో మసిబారి కందిపోయిన బాలకార్మికుల చేతులు చూసి అధికారులు చలించిపోయారు. కార్మికశాఖ అధికారుల ఫిర్యాదుపై బట్టీ నిర్వాహకుడు రమణపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. విముక్తి కలిగించిన బాలకార్మికులను నల్లగొండలోని శిశు సంరక్షణ కేంద్రానికి అక్కడి నుంచి వారి సొంత ప్రాంతాలకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో తహసీల్దార్ హరిబాబు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ, రూరల్ ఎస్‌ఐ లోకేష్, లేబర్ ఆఫీసర్ శేషారత్నం, ఆపరేషన్ స్మైల్ ఎస్‌ఐ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడిలో ఇద్దరికి గాయాలు

చిట్యాల రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వనిపాకల గ్రామంలో ఇరువర్గాల పరస్పర దాడుల్లో ఇరువురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం వనిపాకలకు చెందిన మేడి రామలింగయ్య తన సోదరుడు ఎల్లయ్య అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 23న ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించుకుని అదేరోజు రాత్రి స్వగ్రామానికి ఆటోలో తీసుకువచ్చాడు. ఎల్లయ్య ఇంటి వద్ద ఆటోను నిలపగా ఆయన దిగి ఇంట్లోకి వెళ్తున్నాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన బర్రె లింగస్వామి బైక్‌పై రాగా ఆగి ఉన్న ఆటో వద్ద హారన్ కొట్టడంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరిగింది. రామలింగయ్య తరఫున మేడి ఉపేందర్‌తో పాటు పలువురు, బర్రె లింగస్వామి తరఫున మేడి ప్రదీప్‌తో పాటు పలువురు తారాసపడి వాగ్వాదం చేసుకుంటూ ఘర్షణకు దిగి దాడి చేసుకున్నాయి. ఈ ఘటనలో మేడి ఉపేందర్, మేడి ప్రదీప్‌లకు గాయాలయ్యాయి. మేడి ప్రదీప్ యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా మేడి ఉపేందర్ నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాలకు సంబంధించిన వారు బర్రె దుర్గమ్మ, మేడి రామలింగయ్య ఫిర్యాదు మేరకు గాయపడిన వారితో పాటు మరో ఐదుగురిపై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయం, పాఠశాలలో చోరీ

మోటకొండూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామ రామాలయం, ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ ఉపేందర్, గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం అమ్మనబోలు గ్రామానికి చెందిన ఆలయ పూజారి ధర్మపురి శోభన్ ప్రతి రోజూ రామాలయంలో పూజలు నిర్వహిస్తుంటారు. గురువారం సాయంత్రం శోభన్ తండ్రి వెంకటేశ్వర్లు పూజలు చేసి గుడికి తాళం వేశారు. శుక్రవారం ఉదయం ఆలయంలో దీపం పెట్టడానికి శోభన్ వెళ్లాడు. గుడి తాళం పగలగొట్టి ఉండడంతో గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. అదేవిధంగా రామాలయం వెనక ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. రామాలయంలో గ్రాము బంగారు ఆభరణం ఎత్తుకెళ్లారని శోభన్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

భువనగిరి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఎల్బీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలో శుక్రవారం చోరీ జరిగింది. చెన్నోజు ఉపేంద్ర, భిక్షపతి పనుల నిమిత్తం బయటకు వెళ్లగా కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేటప్పటికీ ఇంటికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. స్థానికులతో కలిసి ఇంట్లో పరిశీలించగా రూ.1.40 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.12వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

టెంటు పీకేసి, అధికారులను నిలదీసి





రామలక్ష్మీపురంలో టెంట్‌ను తొలగించిన గ్రామస్థులు, పంచాయతీ కార్యాలయంలో కూర్చున్న కార్యదర్శి బాలరాజు

కోదాడ రూరల్, తుర్కపల్లి, గుండాల, చౌటుప్పల్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామలక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ తీవ్రఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్ లబ్ధిదారుల జాబితా చదువుతుండగా, గ్రామస్థులు ఒక్కసారిగా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందలేదని ఆరోపిస్తూ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఉన్నతవర్గాలకు పథకాలు అందజేశారని, ఐదు నుంచి 10 ఎకరాలున్న రైతులను ఎంపిక చేశారని గ్రామసభను అడ్డుకుని, వేసిన టెంట్‌ను పీకేశారు. గ్రామంలో కాంగ్రెస్ రెండువర్గాలు ఉండగా, గ్రామ కార్యదర్శి బాలరాజు ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం వల్లే ప్రభుత్వ పథకాలు మొత్తం వారికే అందాయని ఆరోపిస్తూ మరో వర్గానికి చెందిన కొంతమంది కార్యదర్శిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అతను వెంటనే సభ నుంచి వెళ్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో తలదాచుకున్నాడు. దీంతో ఆందోళనకారులు పంచాయతీ కార్యాలయానికి తాళంవేశారు. దాంతో ఇరువర్గాలు ఒకరినొకరు నెట్టుకుంటూ కొట్టుకునేందుకు సిద్ధమయ్యారు. గ్రామసభ నిర్వహణకోసం ఒక్క పోలీస్‌ను మాత్రమే పంపడంతో ఆందోళనకారులను అదుపుచేయడం సాధ్యం కాలేదు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎంపీడీవో రాంచందర్‌రావు, ఎంపీవో పాండురంగయ్యలు గ్రామానికి వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి సిబ్బందితో చేరుకుని గ్రామసభ నుంచి ఆందోళనకారులను బయటికిపంపారు. తిరిగి ప్రారంభమైన గ్రామసభలో అధికారులు లబ్ధిదారుల జాబితా చదువుతుండగా ఇరువర్గాల వారు అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ప్రజాపాలనలో 400 ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, 40మంది లబ్ధిదారుల పేర్లు మాత్రమే చదివి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఇరువర్గాలు ఒకరినొకరు ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. పోలీసులు వెంటనే ఇరువర్గాలను శాంతింపచేసి బయటికి పంపారు. అధికారులను పోలీస్‌పహారాలో కోదాడకు తరలించారు. ఇదిలా ఉండగా మూడురోజులు ముందే రామలక్ష్మీపురం లబ్ధిదారుల జాబితా సోషల్ మీడియాలో హల్‌చల్ కావడవంతో అర్హత కలిగిన లబ్ధిదారులు తీవ్రనిరాశకు లోనయ్యారు. ఈ నేపథ్యంలోనే ఘర్షణ చోటుచేసుకుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

కాళ్లు మొక్కుతా సార్...

గుండాల మండల కేంద్రంలో గ్రామసభలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతుండగా మండల కేంద్రానికి చెందిన శ్రీపతి లక్ష్మమ్మ తనకు అర్హత ఉన్నా పింఛన్ రావడం లేదని, సారూ నీ కాళ్లు మొక్కుతా పింఛన్ ఇప్పించండి అని కాళ్లు మొక్కే యత్నం చేసింది. వెంటనే ఎమ్మెల్యే స్పందించి తప్పకుండా పింఛన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

● గుండాల మండలం వంగాల గ్రామంలో సీసీరోడ్డు శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు నిరసన సెగ ఎదురైంది. అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు జాబితాలో తమ పేర్లు లేవని కొంతమంది ప్లకార్డులతో నిరసన తెలిపారు. గమనించిన ఎస్‌ఐ సైదులు, పోలీస్ సిబ్బంది వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ప్రతి ఒక్క పథకం అందేలా కృషి చూస్తానని ఎవ్వరూ అధైర్య పడవద్దని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

● చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 13వ వార్డులోని సమస్యలను పరిష్కరించడంలో చైర్మన్ వివక్ష చూపారంటూ స్థానికులు గ్రామసభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



తుర్కపల్లి గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో పేరు లేదని కంటతడి పెడుతున్న తాటికొండ భాగ్యమ్మ

గరీబోళ్లకు అన్యాయం చేయొద్దు

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితాలో తనకు అన్యాయం జరిగిందని, ఈ జాబితాలో తనపేరు ఎందుకు లేదని మండల కేంద్రానికి చెందిన తాటికొండ భాగ్యమ్మ అధికారులను నిలదీశారు. తనకు నలుగురు ఆడపిల్లలున్నారని, ఇల్లు లేక కిరాయి ఇంట్లో ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. గరీబోళ్లకు అన్యాయం చేయవద్దంటూ అధికారుల ఎదుట కంటతడి పెట్టుకుంది.

సాగర్ బుద్ధవనం మహాద్భుతం

ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు



బుద్ధవనంలో బుద్ధుడి పాదాలకు పూజలు చేస్తున్న ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు

నాగార్జునసాగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం మహా అద్భుతంగా ఉందని ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు అన్నారు. రాష్ట్రంలో నూతన విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా నాగార్జునసాగర్ రైట్‌బ్యాంక్ పరిధిలో స్థలపరిశీలన కోసం శుక్రవారం సాగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. చరితవనం, స్థూపవనం, ధ్యానవనం, జాతక వనం, మహాస్థూపంలను తిలకించారు. కార్యక్రమంలో ఏఎస్ఎన్ మూర్తి, అజయ్‌కుమార్, అర్వింద్ తివారి, శిబి చక్రవర్తి, బాబు, డీకే మిశ్రా ఉన్నారు. వారికి బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు. వారి వెంట ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్ తదితరులు ఉన్నారు.

కందిపోతోన్న ధర

(5వ పేజీ తరువాయి)

మద్దతు ధర దక్కేలా సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో జిల్లాకు ఒక్క కొనుగోలు కేంద్రమైనా ఏర్పాటు చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్రాలు ఏర్పాటు చేయిస్తాం: జ్యోతి, అసిస్టెంట్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్

ప్రభుత్వ మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లోనే కందులకు ఎక్కువ ధర లభిస్తున్నందున నల్లగొండ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రైతులకు మద్దతు ధర ఇప్పించేందుకు కృషి చేస్తాం. తక్షణమే నల్లగొండ జిల్లాలో మార్క్‌ఫెడ్ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తాం. రైతులెవరూ మద్దతు ధర కంటే తక్కువ ధరకు కందులు అమ్మాల్సిన అవసరం లేదు.

ఓవరాల్ ఛాంపియన్లుగా సూర్యాపేట, కోదాడ

● ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల స్థాయి క్రీడాపోటీలు

నాగార్జునసాగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. సాగర్‌లోని హైలాన్‌కాలనీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణంలో రెండు రోజులుగా ఉత్సాహంగా క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన 20 కళాశాలలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో విభాగంలో సాగర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. వాలీబాల్ విభాగంలో ద్వితీయస్థానం సాధించారు. బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్లుగా సూర్యాపేట కళాశాల విద్యార్థులు, బాలికల విభాగంలో కోదాడ కళాశాల విద్యార్థులు నిలిచారు. విజేతలకు మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయిలయ్య, పీడీ వెంకట్, కన్వీనర్ శ్రీనివాస్, నిరంజన్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దావోస్ పర్యటన విఫలం

● మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పక్కన మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, సునీత, లింగయ్య,ప్రభాకర్‌రెడ్డి,భూపాల్‌రెడ్డి, మల్లయ్య యాదవ్, భిక్షమయ్య గౌడ్

నల్లగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన విఫలమైందని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ వేదికగా సీఎం వ్యవహరించిన తీరు తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసిందని, దావోస్ వేదికగా వస్తోన్న పెట్టుబడులన్నీ ఇంతకుమునుపు కేటీఆర్ హయాంలో వచ్చిన వేనన్నారు. మేఘా కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం డెస్టినేషన్ పెళ్లిలా ఉందని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌తో ఎందులోనూ ఈ కాంగ్రెస్ నేతలు పోటీ పడలేరని ఎద్దేవా చేశారు. చిల్లర మాటలు, చిల్లర చేష్టలతో తెలంగాణ పరువు తీస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాట్లాడాలని, ప్రజలు నవ్వుకునేలా పాలన ఉండకూడదని సూచించారు. ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 3లక్షల ఉద్యోగాలు ఉంటే, కేటీఆర్ మంత్రిగా చేసిన హయాంలో 9లక్షల ఉద్యోగాలను కల్పించినట్లు వెల్లడించారు. ఐటీ ఎగుమతులు రూ.40వేల కోట్ల నుంచి రూ. 2.40లక్షల కోట్లకు చేర్చిన ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌దేనని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదని, ప్రభుత్వానికి దమ్మున్నటే ఇప్పటివరకు ఎంత ధాన్యం కొన్నారో, అందులో ఎంత ధాన్యానికి బోనస్ ఇచ్చారో అధికారికంగా ప్రకటించాలని జగదీష్‌రెడ్డి సవాల్ చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిషోర్, కంచర్ల భూ పాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, నిరంజన్ వలీ, చీర పంకజ్ యాదవ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, రావుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధం ఊరేగింపు

▸▸ పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ▸▸ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



జాన్‌పహాడ్ దర్గా గంధం ఊరేగింపు

పాలకవీడు, జనవరి24: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శుక్రవారం వైభవంగా కొనసాగింది.. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి పూజారి జానీ తీసు కొచ్చిన గంధాన్ని చందల్‌ఖానాలో ఉంచారు. ఆ గంధాలను ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై ఊరే గించారు. గంధం బిందెలను నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎత్తుకొని చందల్ ఖానాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందల్‌ఖానాలలో పూజల అనంతరం గంధాన్ని సంప్రదాయకంగా ముస్లింలు కల్మెటతండా, జాన్‌పహాడ్, చెర్వుతండా గ్రామాల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు గురువారం అర్ధరాత్రి నుంచే దర్గా వద్దకు చేరుకుని గంధం ఊరేగింపులో పాల్గొన్నారు. అక్కడి నుంచి దర్గా వద్దకు తీసుకువచ్చి హజ్రత్‌సయ్యద్ మోహినుద్దీన్‌షా, జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపైకి ఎక్కించారు. గంధం ఎక్కించేటప్పుడు దర్గాలోని భక్తులను పోలీసులు బయటకు పంపించి గంధాన్ని సమాధులకు ఎక్కించారు. దర్గాపరిసరాలలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో భక్తులు తొక్కిసలాట లేకుండా దర్శనం చేసుకున్నారు. భారీగా పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

ప్రత్యేక బస్సులు

ఉర్సుకు వచ్చే భక్తుల కోసం మిర్యాలగూడ, కోదాడ డిపోల నుంచి నేరేడుచర్ల,దామరచర్ల మీదుగా జాన్‌పహాడ్ దర్గా వరకు ప్రత్యేక ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. డిపో అధికారులు స్వయంగా పర్యవేక్షించి భక్తులకు ఇబ్బందులు జరకుండా చూశారు. గురువారం సాయంత్రం నుంచే భక్తుల రద్దీతో ఈ ప్రాంతం అంతా రద్దీగా మారింది. రెవెన్యూశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, ఎక్సైజ్, అగ్నిమాపకశాఖలతోపాటు పంచాయతీ రాజ్ శాఖ, ఆర్టీసీ ప్రత్యేక క్యాంపులు నిర్వహించి భక్తులకు సేవలందించారు. దక్కన్‌సిమెంట్ ఫ్యాక్టరీ 8 ట్యాంకర్ల ద్వారా నిరంతరాయంగా నీటిని సరఫరా చేసింది. ఆర్డీవో శ్రీనివాసులు, సీఐలు చరమందరాజు, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఐబీ సీఐ ప్రభాకర్, పాలకవీడు ఎస్ఐ లక్ష్మీనర్సయ్యలతోపాటు నేరేడుచర్ల, మటంపల్లి, గరిడేపల్లి, హుజూర్‌నగర్ ఎస్‌లు, పాల కవీడు తహసీల్దార్ కమలాకర్, ఎంపీడీవో లక్ష్మి, 550మంది పోలీస్ సిబ్బంది భక్తులకు సేవలందించారు.



లక్షకు పైగా భక్తులు

జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు తెలంగాణ జిల్లాల నుంచే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కృష్ణా, గుంటూరు, ఒంగోలు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు తరలి వచ్చారు. కృష్ణానది అవల వున్న గ్రామాల్లో భక్తులు పుట్టిపై ప్రయాణించి దర్గాను దర్శించుకున్నారు. గంధాన్ని ఊరేగింపుగా తీసుకు వచ్చేటప్పుడు వేలాది మంది గంధం అందుకునేందుకు తోసుకున్నారు. రోప్ పార్టీ గంధం ఊరేగింపులో గంధం చుట్టూ ఉన్నా అందుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. దర్గాలో పూజలు నిర్వహించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. పోలీసులు దర్గాలోనే ఉండి భక్తులకు ఇబ్బందులు జరగకుండా ప్రశాంతంగా దర్శనం అయ్యేలా చూశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.



విద్యుత్ వెలుగుల్లో జానపహాడ్ దర్గా

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలి



చెర్వుగట్టులో జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ప్రచారం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వామివారి జాతరకు సంబంధించిన ప్రచార రథాలను శుక్రవారం చెర్వుగట్టులోని పార్వతీ మాత ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వాల్ పోస్టర్లు, కరపత్రాలను, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవస్థా నం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఏసీ భాస్కర్, ఈవో సిరికొండ నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, నల్ల వెంకన్న, గడసు శశిధర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, రాధారపు భిక్షపతి, యెల్లెందుల కిట్టు, శ్రీకాంత్, దేవస్థాన సిబ్బంది ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో రూ.2,652 కోట్ల టర్నోవర్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.2,652కోట్ల టర్నోవర్‌తో లాభాల బాటలో పయనిస్తుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డీసీసీబీలో జరిగిన ఉమ్మడి జిల్లా మహాజన సభలో ఆయన మాట్లాడారు. తమ పాలకవర్గం అధికారం చేపట్టిన నాటికి రూ.900కోట్ల టర్నోవర్‌లో ఉన్న బ్యాంకును అందరి సహకారంతో రూ.2,652కోట్ల టర్నోవర్ తీసుకొచ్చి రూ.30 కోట్ల లాభాలకు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలోనే బ్యాంకు గతంలో 8వ స్థానంలో ఉండగా ప్రస్తుతం రెండో స్థానానికి తీసుకవచ్చిన ఘనత తమ పాలకవర్గానికి దక్కిందన్నారు. పంట రుణం ఎకరానికి రూ. లక్ష ఉండగా దానిని రూ.1.50లక్షలకు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం సంఘాలకు ఇవాల్సిన డెవిడెంట్లను ఇవ్వాలని నిర్ణయిం చినట్లు చెప్పారు. సహకార సంఘాల్లో పాతుకపోయిన సీఈవోలను బదిలీ చేయడానికి అవసరమైన కార్యచరణను రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చిన పంట రుణా లు రూ.500 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 324కోట్ల రుణమాఫీ ప్రభ ుత్వం చేసిందన్నారు. బ్యాంకుకు రూ.100కోట్ల డిపాజిట్ సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకు రూ. 92కోట్ల డిపాజిట్లను సేకరించామని, నెలాఖరు వరకు లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. పాలకవర్గం కాలపరిమితి పెంచాలని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేస్తుందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏశిరెడ్డి దయాకర్ రెడ్డి, సీఈవో శంకర్ రావు, మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, అందెల లింగయ్య యాదవ్, అంజయ్య పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహుడికి సువర్ణ పుష్పార్చన

భువనగిరి అర్బన్, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారివారికి సువర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవో త్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆగమ శాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులువేకువ జామున సుప్రభాతసేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు, కుంకుమతో ఆర్చించా రు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సా యంత్రం ప్రధానాలయంలో అండాళ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మ వారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు మంగళవాయిద్యాలు, మహిళల మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు రూ.14, 13,405 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

ఇల్లు కావాలి..

(5వ పేజీ తరువాయి)

అందజేయనుంది. అయితే పైరవీలకు ఆస్కారం ఇస్తే లబ్ధిదారులు ఇబ్బందులు తప్పవు. గతంలో డబుల్‌బెడ్‌రూంలను ఇళ్లు ఉన్నవారికి సైతం మంజూరు చేశారు. ప్రస్తుతం నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో సైతం అనర్హుల పేర్లు జాబితాల్లో ఉన్నాయి. ఇది కేవలం జాబితా అని, తుది జాబితా కాదని, అనర్హులుంటే తీసివేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో కావాలనే ఇందిరమ్మ కమిటీల పేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులకు, కార్యకర్తల పేర్లు చేర్చుతున్నారని పలువురు నిరసనలు తెలిపారు. సుమారు మండలానికి 200 ఇళ్లు కేటాయించే అవకాశం ఉంది. ప్రతీ గ్రామానికి 20 నుంచి 30 ఇళ్లు వచ్చే అవకాశం ఉంది.

తేలిన సాగుకు అనువైన భూముల లెక్క

రైతు భరోసా అమలు కోసం వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలో 6.19లక్షల ఎకరాలకు రైతుబంధు పథకం అమలులో ఉంది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం సాగు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో సాగుకు యోగ్యం కానీ భూములు 7,545 ఎకరాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ భూములకు ఇక నుంచి రైతు భరోసా రాదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు యోగ్యంకాని భూముల లెక్కలను అధికారులు తేల్చారు.

నాలుగు గుట్టలు.. 244 ఎకరాలకు రైతు బంధు

(ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్ టౌన్): యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలంలో నాలుగు గుట్టలకు చెందిన 244 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములుగా అధికారులు గుర్తించారు. గత 11 విడతలుగా వీటి పట్టాదారులకు రైతు బంధు నిధులు జమయ్యాయి. కైరతాపురం గ్రామంలోని సర్వే నంబర్లు, 2, 3లో 38 ఎకరాలు, ధర్మాజీగూడెంలో సర్వే నంబరు 21లో 13 ఎకరాలు, తంగడపల్లిలోని సర్వే నంబరు 633లో 130 ఎకరాలు, సర్వే నంబరు 639లో 73ఎకరాలుగా గుట్టలు ఉనాయిఇ. మండలం మొత్తంగా 1,752 మంది రైతులకు చెందిన 1,589 ఎకరాలను సాగుకు యోగ్యంగా లేని భూములుగా అధికారులు సర్వేలో గుర్తించారు. అందులో అత్యధికంగా దండు మల్కాపురంలో 411 ఎకరాలు ఉన్నాయి. మండలంలో 18,929 మంది రైతులకు చెందిన 41,515 ఎకరాలకు రైతు బంధు గతంలో మంజూరైంది. అందులో సాగుకు యోగ్యం కాని భూములు 1,589 ఎకరాలు ఉండగా, ఇకపై 39,916 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా వర్తించనుంది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తాం. ప్రజాపాలనలో దర ఖాస్తులు చేసిన వారితో పాటు ప్రస్తుతం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో చేసిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పథకాలు వర్తింపజేస్తాం. సంక్షేమ పథకాల అమలులో ప్ర జలు ఎలాంటి అపోహలకు గురి కావొద్దు. సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎక్కడా, ఎలాంటి పొరపాట్లకు తావు లేదు.

తేజస్‌నందలాల్ పవార్, సూర్యాపేట జిల్లా కలెక్టర్

ఓటరూ .. శాసించు

ఓటు హక్కుతోనే అది సాధ్యం



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట కలెక్టరేట్): ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే ఓటు హక్కును వినియోగించుకోవడంతో కొందరు నిర్లక్ష్యంగా వ్యవ హరి స్తు న్నారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు. ఈ నేపథ్యంలో ఓటు ప్రాముఖ్యతను, ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం ప్రచారం నిర్వహిస్తూనే ప్రజల్లో చైతన్యం కలిగేలా చర్య లు చేపట్టింది. దీంతో ఎంతో మంది యువతీ, యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో వినియోగించు కుంటున్నారు. తాజాగా అర్హులకు ఓటుహక్కు కల్పించేందుకు 20 25 జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలో ఓటు హక్కు కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అందులో భాగంగానే నేడు ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం

ఓటు విలువను చాటి చెప్పేందుకు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల్లో ఓటరు దినోత్సవం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మండలాల్లో రెవెన్యూ అధికారులు, గ్రామస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. అంగన్‌వాడీల ద్వారా గ్రామాల్లో ఓటరు దినోత్సవం ఒక పండుగలా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. విద్యార్థులకు ఓటు హక్కుపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.

ఎన్నికల సంఘానికి 75 ఏళ్లు

1950 జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటైంది. సంఘం ఏర్పడి నేటికి 75ఏళ్లు పూర్తి చేసుకోనుంది. దేశంలోని రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నా రు. ఆ తర్వాత రాష్ట్రాల్లో సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారిగా నియమించి ఆయా రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల నిర్వహణ బాధ్యతను వారికే అప్పగించారు.

జిల్లాలో 10,08,151మంది ఓటర్లు

సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం 10,08,151 మంది ఓటర్లు ఉన్నారు. కాగా సూర్యాపేట నియోజకవర్గంలో 2,46,437 మంది కోదాడలో 2,47,247మంది, హుజూర్‌నగర్‌లో 2,53, 110 మంది ఉన్నారు. తుంగతుర్తి 2,61,357మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది ఓటరు దినోత్సవం నుంచి ఇప్పటి వరకు కొత్తగా జిల్లాలో 21 ,616 మంది యువతీ, యువకులతో పాటు ఓట్లు గల్లంతైన వారు ఓటు హక్కు పొందారు.

మార్పులు, చేర్పులు ఇలా

జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి. వారు నివసించే ప్రదేశంలో గల పోలింగ్ కేంద్రానికి వెళ్లి వయస్సు ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ తెలిపే ఆధారాలతో ఓటు హక్కును పొందాల్సి ఉంటుంది. అందుకోసం ఫామ్-6 ద్వారా ఓటు హక్కును పొందవచ్చు. ఓటరు జాబితాలో పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు, చిరునామా, వయస్సు, ఇంటి అడ్రస్ తప్పుగా ఉంటే ఫామ్-8ద్వారా సరి చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక ఒక పోలింగ్ కేంద్రం పరిధి నుంచి మరోక పోలింగ్ కేంద్రం పరిధిలోకి మారిస్తే ఓటు హక్కు కూడా ఫామ్-8ఏ ద్వారా సంబంధిత ఓటు హక్కును మారిన పోలింగ్ కేంద్రం పరిధిలోకి మార్చుకునే అవకాశాలు ఉన్నాయి. వీటితో పాటు ఒక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు, ఓటు తొలగించుకోవాలంటే ఫామ్-7ద్వారా చర్యలు చేపట్టనున్నారు.

బోగస్ ఓట్ల తొలగింపునకు అవగాహన

కొందరు వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో వారి ఓటు హక్కును కల్గి ఉంటారు. ఏదైనా వ్యక్తికి ఒక చోటనే ఓటు హక్కు కల్గి ఉండాలనేది నిబంధన ఉంది. ఒక చోట మాత్రమే ఓటు హక్కును ఉంచుకొని మరో చోట ఉన్న ఓటు హక్కును సంబంధిత వ్యక్తులు స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. కొంత మంది గ్రామాలు, పట్టణాలలో ఓటు హక్కును కల్గి ఉంటారు. ఎన్నికల సమయంలో రెండు చోట్ల ఓటు హక్కును వినియోగించుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి బోగస్ ఓట్లను ఏరివేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలి. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన వారు బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు అనేది వజ్రాయుధం. అందుకోసం ఓటు హక్కు పొందాలి. రెండు చోట్ల ఓటు ఉంటే ఒకచోట తొలగించుకోవాలి. మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగిస్తున్నాం . -తేజస్ నందలాల్ పవార్, కలెక్టర్ సూర్యాపేట

విద్యకు అధిక ప్రాధాన్యం

● మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రెటరీ సీహెచ్ ప్రియాంక
● చివ్వెంల గిరిజన గురుకుల పాఠశాల సందర్శన



పాఠశాలను సందర్శిస్తున్న ప్రియాంక

చివ్వెంల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రెటరీ సీహెచ్ ప్రియాంక అన్నారు. ఐఏఎస్ హాస్టల్ నిద్రలో భాగంగా సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గిరిజన గురుకుల పాఠశాలను శుక్రవారంరాత్రి సందర్శించి విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు గురుకులాన్ని సందర్శించినట్లు వివరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు పోషకాలతో కూడిన ఆహారం అందించడం లక్ష్యంగా పాలన సాగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలించి, పాఠ్యపుస్తకాల్లోని ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. నేటి పోటీ ప్రపంచంలో విద్య ముఖ్యమైందని, విద్యార్థులు ఆదిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గాభవాని, ఉపాధ్యాయులు సుజాత, సంధ్యారాణి పాల్గొన్నారు.

బంగారం తాకట్టు వ్యాపారి పరార్



దుర్గాభవాని జ్యూవెల్లర్స్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఓ బంగారు నగల తాకట్టు వ్యాపారి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధి తులు గతంలో ఆ వ్యాపారి పనిచేసిన దు కాణం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. తాకట్టు పెట్టుకున్న బంగారం, వడ్డీలకు తీసుకున్న నగదు మొత్తం రూ.5కోట్లకు పైగా ఉంటుందని బాధితులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నా యి. రాజస్థాన్‌కు చెందిన జితేందర్ సింగ్ రాథోడ్ బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం యాదగిరిగుట్టకు వచ్చాడు. పట్టణంలో దుర్గాభవాని జ్యూవెల్లర్స్‌లో పనికి చేరాడు. మూడేళ్ల తర్వాత కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం యాదగిరిగుట్టలోని పాతగుట్ట రోడ్డుకు ఎదురుగా సుమారు 80 గజాల స్థలాన్ని రూ.80లక్షలకు కొనుగోలు చేసి, అందులో భవనాన్ని నిర్మించి జై భవాని పేరుతో తాకట్టు వ్యాపారం చేస్తున్నాడు. ఇతన్ని నమ్మి బంగారం తాకట్టుపెట్టి రూ.లక్షలు అధిక వడ్డీకి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో జితేందర్‌సింగ్ రాథోడ్ స్థానికుల వద్ద అధిక వడ్డీకి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. ఇతని వద్ద బంగారం తాకట్టు పెట్టుకున్న వారికి ఫోన్‌చేసి డబ్బులు చెల్లించి బంగారం తీసుకోవాలని సూచించాడు. అయితే సుమారు 10మంది డబ్బులు చెల్లించారు. కానీ ఇతను బం గారం ఇవ్వకుండా రెండు రోజుల తర్వాత ఇస్తానని నమ్మబలికాడు. వీటికితోడు జితేందర్‌కు అప్పులు పెరగడంతో స్థానికులకు చెప్పకుండా ఉడాయించాడు. తాకట్టు పెట్టుకున్న బంగారం, వడ్డీలకు తీసుకున్న నగదు మొత్తం రూ.5కోట్లు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బాధితులు ఇతను గతంలో పనిచేసిన దుర్గాభవాని జ్యూవెల్లర్స్ వద్ద బాధితులు, వారి కుటుంబ సభ్యులు 500మందితో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట సీఐ రమేష్, ఎస్ఐ ఉదయ్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారికి సర్దిజెప్పే ప్రయత్నం చేయగా, వినకపోవడంతో పోలీసులు డబ్బులు ఇప్పించే ప్రయత్నం చేస్తామని, స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయమని చెప్పారు. అలాగే దుర్గాభవాని జూవెల్లర్స్ యాజమాన్యం సహకారంతో నిందితుడిని రప్పించి, మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పలువురు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.20లక్షలు అప్పుగా తీసుకున్నాడు



నాకు ప్రతీనెల వడ్డీ ఇస్తానని నమ్మబలికి రూ.20లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఈ నెల 23న డబ్బులు ఇస్తానని సాయంత్రం వరకు మాట్లాడాడు. ఈరోజు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో దుకాణం వద్దకు రాగానే ఉడాయించి తెలిసింది. రూ.20లక్షలు ఇచ్చి తీవ్రంగా నష్టపోయా. శైలు, హైదరాబాద్

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీఆర్‌ఎస్

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



కొంపల్లి జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడురూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొంపల్లి జడ్పీహైస్కూల్‌లో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతుల నిర్మాణంతో పాటు వెదిర పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కళావేదికను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, మునుగోడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మొదటి ప్రాధాన్యత విద్యకే ఇస్తానని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారి డి.నాగేశ్వర్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ మెగారెడ్డి, రామాలయ చైర్మన్ వెదిర విజయేందర్‌రెడ్డి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, వట్టికోటి శేఖర్, అన్వర్, రత్నాచారి, అప్పారావు, మణియాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో రాజీపడేది లేదు

మునుగోడు: మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడేది లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు పట్టణంలోని తన సొంత క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నీటి వనరులపై విశ్రాంత ఇంజనీర్ మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డితో సమీక్షించారు. శివన్నగూడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి లభ్యత, ఆ ప్రాజెక్టు దిగువన ఉన్న సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు నీటి తరలింపు అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో చిన్ననీటి వనరుల అభివృద్ధి పరిచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా 122 చెరువులు, 18 చెక్‌డ్యాంలు, 19 సబ్ సర్ఫేస్ డైకులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్యను పెంచి బస్టాండ్లలో సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. మునుగోడు, చండూరు, నాంపల్లి మండలాల్లో ఉన్న ఆర్టీసీ బస్టాండ్లను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో నాలుగు చొప్పున మొత్తం 27 పాఠశాలలను మొదటి విడతలో మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

పానగల్ అభివృద్ధికి అన్ని విధాల కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని చారిత్రాత్మక ప్రాంతమైన పానగల్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పానగల్‌లోని 2వ వార్డులో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ బుర్రి రజిత యాదయ్యతో కలిసి శుక్రవారం ఎస్సీ కాలనీ శ్మశానగదుల నిర్మాణ పనులకు, మైనార్టీ ఖబ్రస్తాన్ నుంచి డ్రైనేజీ నీళ్ల తొలగించు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పానగల్‌లో ప్రతీ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. కాలనీల్లో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులన్నింటినీ పూర్తి చేయించి సస్యశ్యామలం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొజ్జ శంకర్, గణేష్, ఇబ్రహీం, గడిగె హిమబిందు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, తక్కెళ్ల జంగయ్య, బుర్రి కృష్ణశేఖర్, కొప్పు సత్తయ్య, గుండగోని యాదయ్య పాల్గొన్నారు.

ఆల్కాహాల్‌తో అన్నీ అనర్థాలే



పోటీల్లో విజేతగా నిలిచిన కె.ఝాన్సీని అభినందిస్తున్న లక్ష్మీపతి

నల్లగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆల్కాహాల్‌తో అన్నీ అనర్థాలేనని జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి అన్నారు. మానవ మేధస్సుపై, ఆల్కహాల్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు శుక్రవారం స్థానిక డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కె.ఝాన్సీ ప్రథమ, నషీద్ ద్వితీయ, తెలుగు మీడియం విభాగంలో జి.శృతి, కన్సలేషన్, ఉపన్యాస పోటీల్లో బి.స్పందన ప్రథమ, సీహెచ్.కెన్నీజాయ్ ద్వితీయ, పాటల పోటీలల్లో ఎస్.రాజేశ్వరి ప్రథమ, ఆర్.అలేఖ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి ఎంపికైన విజేతలకు 26వ తేదీన కలెక్టర్ ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు గా డైట్ కళాశాల ఆచార్యులు కృష్ణమూర్తి, మమత, ఉపాధ్యాయులు నర్సింహ, ఆంజనేయులు, వివిధ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాగూర్ సేవలు అజరామరం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మునుగోడులో కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు నేత, బీహార్ దివంగత మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ శతజయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించటం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్పూరి ఠాగూర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, దళిత వర్గాల అభ్యున్నతి కోసం చెక్కు చెదరని దీక్ష, సమసమాజ స్థాపనకు చేసిన కృషి స్ఫూర్తిదాయకమని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, మాల్గ యాదన్న, జాజుల వెంకటేష్, గురిజ నర్సింహ, యాదగిరి, దేవలోకం, రుషికేష్, మల్లేష్, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

గట్టుప్పల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జనవరి 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నల్లగొండ జిల్లా సెక్రటేరియేట్ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కష్టజీవుల పక్షాన, రైతులు, ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం చేస్తుందని అన్నారు. సమావేశంలో నాయకులు కర్నాటి సుధాకర్, పెద్దగాని నరసింహ, కర్నాటి వెంకటేశం, అచ్చిన శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, బండారు కృష్ణయ్య, వల్లూరి శ్రీశైలం, కక్కునూరు నగేష్, యాదయ్య, కృష్ణయ్య, పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకున్నాం

తమ పదవి కాలంలో వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకుని పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేసినట్లు నల్లగొండ, చిట్యాల, చండూరు మునిసిపల్ చైర్మన్లు స్పష్టం చేశాం. మునిసిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం శనివారంతో ముగియనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో తమ అనుభవాలను వెల్లడించారు.

ప్రశ్నలు: 1. మీ పదవీ కాలం సంతృప్తినిచ్చిందా?
2. మీరు ఏం చేయాలనుకున్నారు. ఏం చేశారు.
3. మళ్లీ బరిలో ఉంటారా? ఈ సారి మీ ప్లానింగ్ ఎలా ఉండబోతుంది?
4. ప్రభుత్వం నుంచి మునిసిపాలిటీలకు ఎలాంటి తోడ్పాటు ఉండాలి?
5. ఈ ఐదేళ్లలో ఎదుర్కొన్న ప్రధాన సంఘటన, చేదు జ్ఞాపకం ఏమిటి?

రూ. వందల కోట్లతో అభివృద్ధి చేశా

● బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ



1. ఈ 11నెలల స్వల్ప వ్యవధిలో నూటికి నూరు శాతం మార్పు తీసుకవచ్చానన్నా సంతృప్తి ఉంది. మునిసిపాలిటీ పరిపాలనలో మార్పు చేయగలిగాం. అభివృద్ధి కోసం వంద లాది కోట్లను మంజూరు చేయించగలిగాం.
2. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడంతో పాటు జవాబుదారీతనంగా ఉండాలనేది లక్ష్యం.
3. రిజర్వేషన్లు కలిసి వస్తే మళ్లీ బరిలో ఉంటాను. నాతో పాటు నా సతీమణి బుర్రి చైతన్య కౌన్సిలర్‌గా కొనసాగుతూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారు.
4. 8 ఏళ్లుగా మునిసిపాలిటీలకు స్టాంపు డ్యూటీ రా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.28కోట్లు స్టాంపు డ్యూటీ వచ్చింది. దీంతో ఆ నిధులను శానిటేషన్ సిబ్బందికి జీతాలు ఇవ్వడంతో పాటు 5 ట్రాక్టర్లను, 8 ఆటోలను కొనుగోలు చేశాం. ఈ జనరల్ ఫండ్‌ను నల్లగొండ అభివృద్ధికి కేటాయించుకోగలిగాం.
5. గత ప్రభుత్వ మునిసిపల్ పాలకవర్గాన్ని నిర్వీర్యం చేసి కమిషనర్లే రాజ్యాంగేతర శక్తులుగా ఎదగడం, అప్పటి కౌన్సిల్‌కు చేదు జ్ఞాపకం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాను బాధ్యతలు చేపట్టాక పారదర్శకంగా, జవాబుదారితనంగా పనులు చేపట్టగలిగాం.

-నల్లగొండ, ఆంధ్రజ్యోతి

తొలి చైర్మన్‌గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా

● కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిట్యాల



1.చిట్యాల మునిసిపల్ తొలి చైర్మన్‌గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. నాలుగున్నర కోట్లతో పట్టణంలో ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేశాము.
2. చిట్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనుకున్నా. దాదాపుగా లక్ష్యాన్ని చేరుకున్నా. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మునిసిపల్ పార్కు వంటి పనులు పూర్తి చేయలేకపోయాం
3. మంత్రి, ఎమ్మెల్యేల సలహ మేరకు నడుచుకుంటా అలాగే పరిస్థితులు, రిజర్వేషన్లు బట్టి ఆలోచిస్తా
4. మరిన్ని నిధులు మంజూరు చేయాలి
5. చేదు జ్ఞాపకాలు ఏమి లేవు.

- చిట్యాల, ఆంధ్రజ్యోతి

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశా

తోకల చంద్రకళావెంకన్న, చండూరు



1. రాష్ట్రంలోనే కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలోనే అతిచిన్నదిచండూరు. మునిసిపల్ ఆదాయ వనరులు తక్కువగా ఉన్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అభివృద్ధి నిధులతో ఉన్నంతలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి నిధులు చేరేలా కృషి చేశాను.
2. నాడు బీఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, నేను అన్ని పార్టీలకు అతీతంగా ప్రజలతో మమేకమై పట్టణ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశాను.
3. ప్రజలకు సేవ చేసే భాగ్యం, అవకాశం ఇస్తే తప్పకుండా బరిలో ఉంటాను. ఇప్పటికే పట్టణాన్ని సుందరవందనంగా తీర్చిదిద్దాను.
4. ప్రభుత్వం పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలి.
5. ఐదేళ్లలో మునిసిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రయత్నించాను.

- చండూరు, ఆంధ్రజ్యోతి

ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకం

నల్లగొండ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకమైనదని నల్లగొండ ఆర్టీసీ డిపో ఆర్‌ఎం అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా శుక్రవారం నల్లగొండ డిపోలో ఆర్‌ఎం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం డ్రైవర్లకు గులాబీ పుష్ప ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నైపుణ్యంతోతో జాగ్రత్తగా, ప్రమాదరహితంగా ప్రయాణికులను చేరవేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్, డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

చిట్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అనంతరమే రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్‌మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్‌మాదిగ డిమాండ్ చేశారు. చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అందరూ ఎస్సీ వర్గీకరణ సహకరించాలని కోరారు. వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, నాయకులు మేడి అర్జున్, కావలి కృష్ణ, యాకారి మచ్చగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల లబ్ధిదారుల ఎంపిక

● ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం
● జిల్లాలో ముగిసిన గ్రామసభలు



చిట్యాల: వెలిమినేడులో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు అర్హులను పారదర్శకంగా ఎంపిక చేసి పేదలకు అందిస్తే ఎవరినైనా గుండెల్లో పెట్టుకుంటారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే వేముల వీరేశంలో కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలందరికీ అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వాదంతో నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ తన నియోజకవర్గంలో చిట్యాల మండలం వెలిమినేడు, నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలును మండలంగా ఏర్పాటుకు తాను హామీనిచ్చానని ఇప్పటికే రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి మండలాల ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా తానే ప్రతీ గ్రామంలో ఇంటింటికి తిరిగి పథకాలనందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. మండలంలోని పేరేపల్లిలో అర్హుల జాబితాలో పేర్లు లేవని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులు మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వం తప్పనిసరిగా న్యాయం చేస్తుందని అందని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● కట్టంగూరులో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు విడతల వారీగా అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హుల జాబితా ప్రకటించకుండా దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను చదివి కాలయాపన కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నారా అని నిలదీశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఏవో గిరి ప్రసాద్, ఎంపీవో చలపతి తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని రామగిరి, బండమీదిగూడెం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆర్డీవో అశోక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అర్హులైన వారు జాబితాలో పేరు లేకపోతే తక్షణమే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో సౌమ్య శృతి, ఐబీఏఈ రాములు, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నూకల వెంకన్న, రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు యానాల లింగారెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలో మొత్తం 5,422 మంది కొత్తగా పలు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో అనర్హులను పథకాలకు అర్హులుగా గుర్తించారని, దీనివల్ల అసలైన నిరుపేదలు పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. మండలంలోని తిరుగండ్లపల్లి, రాజుపేటతండా, సరంపేట, ఖమ్మగూడెం, అజలాపురం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. రాజుపేట తండా, తిరుగండ్లపల్లి, సరంపేటలో జరిగిన గ్రామసభలో అధికారులకు, ప్రజలకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, ప్రత్యేకాధికారి వేణుగోపాల్, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లి మండలంలోని బండతిమ్మాపురం, సుంకిశాల, దేవత్‌పల్లి, రేక్యతండా, నర్సింహులగూడెం, నేరేళ్లపల్లి, తుమ్మలపల్లి, కేతేపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఆయా సమావేశాల్లో తహసీల్దార్ దేవసింగ్, ఎంపీడీవో మేరి స్వర్ణకుమారి, ఎంపీవో ఝాన్సీరెడ్డి, ఏఈలు రామచంద్రయ్య, ఉదయ్‌సాయిరెడ్డి, ఎంఈవో మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా సాగాయి. మండలంలోని ఇడికూడ గ్రామంలో తహసీల్దార్ దశరథ, శిర్దేపల్లిలో ఏవో చంద్రిక, చొప్పరివారిగూడెం గ్రామంలో ఎంపీడీవో రాంరెడ్డి, తాస్కానిగూడెంలో ఎంపిఓ మాధవరెడ్డి, పడమటితాళ్ల గ్రామంలో సూపరింటెండెంట్ నర్సింహులు పాల్గొని లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. జాబితాలో పేర్లు రాని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

● కేతేపల్లి మండలంలోని గుడివాడ, తుంగతుర్తి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, మండల ప్రత్యేక అధికారి జి.హరీష్, తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, ఎంపీవో జి.నాగలక్ష్మి, ఆర్‌ఐ ఛాంద్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని ఇరుగంటిపల్లి, తేలకంటిగూడెం, తిమ్మన్నగూడెం, అమ్మగూడెం, దర్వేశిపురం, కురంపల్లి, బుడుమర్లపల్లి గ్రామాల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. దర్వేశిపురం గ్రామసభలో ప్రత్యేకాధికారి పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, సూపరింటెండెంట్ ఆండాలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: శ్రీనివాస్‌రెడ్డి



పోటీలను ప్రారంభించి చెస్ ఆడుతున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడిగా ఉండే జర్నలిస్టులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల క్రీడా పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల వారిలో ఐక్యమత్యం పెరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు తామంతా సానుకూల ధోరణితో ఉన్నామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌కు శాశ్వత భవనం కూడా సమకూర్చేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పులి మామిడి మహేందర్‌రెడ్డి, గాదె రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి ఇన్‌చార్జి అధికారి కుంభం నర్సిరెడ్డి, నల్లగొండ ప్రెస్‌క్లబ్ సలహాదారుడు గుండగోని జయశంకర్‌గౌడ్, సభ్యులు ఫహీమొద్దీన్, మేకల వరుణమ్మ, దండంపల్లి రవికుమార్, మధు, కత్తుల యాదగిరి, వెంకట్‌రెడ్డి, సల్వాది జానయ్య, అల్లి మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కుశలవాచారి, సలీం, మధు, వినోద్, జానీ, ముచ్చర్ల విజయ్, కత్తుల హరి, సలీం, మధు, వినోద్, మధు, శీను పాల్గొన్నారు.

నేరేళ్లపల్లిలో ఫ్లెక్సీ వివాదం



నేరేళ్లపల్లిలో గ్రామసభలో అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నాంపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలం నేరేళ్లపల్లి ప్రజాపాలనలో భాగంగా అధికారులు గ్రామ సభను నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫొటోలు కనిపించలేదు. ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఫొటోలు ఫ్లెక్సీలో దర్శనమిచ్చాయి. దీంతో పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కొద్దిసేపు అనంతరం ఫ్లెక్సీని మార్చి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫొటో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

రైతుభరోసాకు దరఖాస్తుల స్వీకరణ

కేతేపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల కొత్తగా భూములు పొందిన రైతుల నుంచి శుక్రవారం కేతేపల్లిలోని రైతు వేదికలో ఏవో బి.పురుషోత్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దరఖాస్తుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు ఉమేష్, నాగరాజు పాల్గొన్నారు.

● కనగల్: కొత్త పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతుభరోసా కింద సాగుకు పెట్టుబడి సాయం కోసం ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏవో అమరేందర్‌గౌడ్ కోరారు.

బాలిక సాధికారిత సమాజం కావాలి

మర్రిగూడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలిక సాధికారిత సమాజం కావాలని దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉదావత్ లచ్చిరాం అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం దామెర బీమనపల్లి పాఠశాలలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా ఉపాధ్యాయులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.మంజుల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లికంటి పార్వతమ్మ మృతి బాధాకరం

● చిత్రపటానికి నివాళులర్పించిన పలువురు నేతలు



పార్వతమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

మునుగోడు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ మృతి బాధాకరమని పలువురు నాయకులు అన్నారు. మండలంలోని ఎలగలగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమిక్ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఉజ్జిని యాదగిరిరావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొని పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, రాష్ట్ర గీత పనివారల సంఘం మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, కంచర్ల కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఇంజనీరింగ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బలుగూరు నరసింహ, తిరుపారి వెంకటేశ్వర్లు, చాపల శ్రీను, లింగయ్యయాదవ్, సైదులు పాల్గొని నివాళులర్పించారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



కట్టంగూరులో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి, కట్టంగూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులు తీసుకువచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్ల పృథ్వీరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుగుడు రవి యాదవ్, నాయకులు మేడి రమేష్, మనోజ్, చింత రఘు, దేశపాక నవీన్, చింత భరత్, చందు, శివ, మత్స్యగిరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు కాపుగంటి నరేష్, నర్సింగ్ సైదులు, దండెంపల్లి వెంకన్న, నక్కల వేణు, రాజు, రవి, బన్ని, వేణు తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 17.0



చిట్యాల మండలం పేరేపల్లిలో గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఇల్లు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు ఉమ్మడి జిల్లా ప్రజల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామ, వార్డు సభలు శుక్రవారంతో ముగిశాయి. కాగా, ఈ సభల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.69లక్షల దరఖాస్తులు రాగా, అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1.08లక్షలు, రేషన్ కార్డుల కోసం 1.05లక్షల దరఖాస్తులు వచ్చాయి.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట కలెక్టరేట్)

- ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 1.08లక్షల దరఖాస్తులు
- రేషన్ కార్డుల కోసం 1.05లక్షలు
- మొత్తం 2.69లక్షల దరఖాస్తులు
- ముగిసిన గ్రామ సభలు
- పలుచోట్ల ఆందోళనలు, నిరసనలు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్వహించిన ప్రజాపాలనలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదే విధంగా ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా కూడా అర్హుల జాబితాను రూపొందించారు.అయితే గ్రామ సభల్లో ప్రకటించిన అర్హుల జాబితాలో పేర్లు లేవని పలు గ్రామాలు, వార్డుల్లో ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు స్పష్టంచేయగా, ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.69లక్షల దరఖాస్తులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,745 పంచాయతీలు, 19 మునిసిపాలిటీల్లో 427 వార్డులు ఉన్నాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి మొత్తం 2,69,295 దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,08,012 దరఖాస్తులు, రేషన్ కార్డుల కోసం 1,05,691, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 49,222, రైతు భరోసా కోసం 6,370 దరఖాస్తులు వచ్చాయి. సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు, ఐదు మునిసిపాలిటీ ల పరిధిలోని 141 వార్డులు ఉన్నాయి. గ్రామ సభల్లో కొత్తగా 77,037 దరఖాస్తులు వచ్చాయి. రైతు భరోసా కోసం 2,828 మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 22,186 మంది, రేషన్‌కార్డుల కోసం 23,798మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28,225 మంది దరఖా స్తు చేశారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో కూడా పలువురు దరఖాస్తు చేసుకోగా, అందులో కొంతమందిని మాత్రమే అధికారులు అర్హులుగా గుర్తించారు.

పలు గ్రామాలు, వార్డుల్లో ఆందోళనలు

ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో పలు చోట్ల ప్రజలు ఆందోళనకు దిగారు. సభల్లో అధికారులు ప్రకటించిన జాబితాలో పేర్లు లేవని నిరసన తెలిపారు. అర్హులు కానీ వారి పేర్లు జాబితాలో ఉన్నాయని నిలదీశారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు రాకుండా చేస్తున్నారని వాపోయారు. దీంతో పలు చోట్ల గ్రామ, వార్డు సభలు వాడివేడిగా సాగాయి.



గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు

సూర్యాపేట: నిరుపేదలు ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలన సభల సమయంలో భారీగా దరఖాస్తు లు ఇచ్చారు. ఒక్క సూర్యాపేట జిల్లాలో 5,135 దరఖాస్తులు రాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20వేల లోపు దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. గతంలో సూర్యాపేట జిల్లాకు 5,424 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా, 3,086 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇవి చాలాకాలంగా వాడకంలో లేక కిటికీలు, అద్దాలు, విద్యుత్ వైరింగ్ ధ్వంసమైంది. గతంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో సైతం ఇందిరమ్మ కాలనీలు 1, 2, 3 ఏర్పాటు చేసి 80 గజాల చొప్పున స్థలాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు వారికున్న స్థోమ త ఆధారంగా ఇళ్లను నిర్మించుకున్నారు. కొంత మంది నేటికీ ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. అయితే వారికి ప్రస్తుతం స్థలం ఉన్నందున ఆర్థిక సహాయం అందించాలని ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. అందులో మునిసిపాలిటీలకు పెద్ద మొత్తంలో కేటాయించనున్నారు. తొలి విడతలో స్థలం ఉన్న వారికి రూ.5లక్షల నిధులు కేటాయిస్తారు. స్థలం లేనివారికి ప్రభుత్వం రెండో విడతలో స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు

- మిగతా 7వ పేజీలో...

జిల్లా	రేషన్ కార్డులు	ఇందిరమ్మ ఇళ్లు	ఆత్మీయ భరోసా	రైతు భరోసా	మొత్తం
నల్లగొండ	53,844	47,471	15,485	844	1,17,644
సూర్యాపేట	23,798	28,225	22,186	2,828	77,037
యాదాద్రి	28,049	32,316	11,551	2,698	74,614
మొత్తం	1,05,691	1,08,012	49,222	6,370	2,69,295



కందిపోతోన్న ధర

- కందులకు దక్కని మద్దతు ధర
- మార్కెట్‌కు వచ్చే క్రమంలో తగ్గిన ధర
- మద్దతు ధర రూ.7,550.. రూ.6వేలకు మించని వైనం

నల్లగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పప్పు ధాన్యాలకు మద్దతు ధర కరువైంది. కందుల కొనుగోళ్లలో వ్యాపారులు చెప్పిందే ధరగా చెలామణి అవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దిగుబడి తక్కువగా ఉండడం, సీజన్‌కు ముందు కనీస మద్దతు ధరకంటే ఎక్కువ ధర బహిరంగ మార్కెట్లో లభిస్తే, రైతుల నుంచి కందులు మార్కెట్‌కు రావడం మొదలయ్యాక వ్యాపారులు ధర తగ్గించేశారు. ఉత్పత్తి తక్కువగా ఉండడం, బహిరంగ మార్కెట్లో మద్దతు ధరకు మించి ధర లభిస్తున్న క్రమంలో మార్క్‌ఫెడ్ సైతం కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేయడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు జరగలేదు. మరోవైపు నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో కందులకు మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు నష్టపోతున్న పరిస్థితి నెలకొంది.

వ్యాపారులు ధర తగ్గించడంతో రైతుల బేజార్

కందులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550 కాగా, ప్రస్తుతం ఒక్క సూర్యాపేట మార్కెట్లో మాత్రమే క్వింటాల్‌కు కనీస మద్దతు ధరకు సరిసమానంగా ధర లభిస్తుంటే, నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లోని నల్లగొండ, హాలియా, నకిరేకల్, భువనగిరి, ఆలేరు, మోత్కూరులో ధర క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6వేలకు లోబడి మాత్రమే లభిస్తోంది. సూర్యాపేటలో మార్క్‌ఫెడ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు, ఎగుమతిదారులు సైతం ఇక్కడ కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో ఈ మార్కెట్లో ధర లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో కందుల కల్లాలు ముగిసి విక్రయానికి కందులు వస్తున్న తరుణంలో ధర లేకపోవడంతో రైతులకు పెట్టుబడులు సైతం దక్కని దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 10,326 ఎకరాల్లో కంది సాగుచేయగా, 48,020 క్వింటాళ్ల కందుల ఉత్పత్తి వస్తుందని అంచనావేశారు. కంది పంటను వానాకాలం సాగులో పత్తిలో అంతరపంటగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికంగా సాగవడంతో పాటు, ప్రత్యేకంగా కంది సాగు కూడా ఈ దఫా అత్యధికంగా సాగయింది. వ్యవసాయశాఖ నమోదులో కేవలం ప్రత్యేక సాగునే పేర్కొనడం, దిగుబడులు సైతం గరిష్ఠంగా నాలుగు క్వింటాళ్లే నమోదు చేయడంతో వాస్తవ ఉత్పత్తి అంతకు మించి వచ్చిందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారుల అంచనా ప్రకారం వచ్చే 48,020 క్వింటాళ్లు అయితే, వాస్తవానికి ఇంతకు రెట్టింపుగా ఉత్పత్తి వచ్చిందని, దీనిని అధికారులు అంచనా వేయలేకపోవడంతోనే మార్కెట్లో రైతులకు విక్రయాలకు ఇబ్బంది ఎదురవుతుందని చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి ఇప్పటికైనా రైతులకు..

- మిగతా 6వ పేజీలో...



నల్లగొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కంచర్ల

సీఎం దావోస్ పర్యటన విఫలం

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి •7లో..

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

టీఆర్‌వీకేఎస్ అధ్యక్షుడు కరెంట్‌రావు



రిలే దీక్షలో మాట్లాడుతున్న కరెంట్‌రావు

నల్లగొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లోకి మార్చాలని తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.కరెంట్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై జేఏసీ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికులు పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎప్పటికైనా రెగ్యులర్ అవుతారనే ఆశతో అరకొర వేతనాలతో కుటుంబాలను వెళ్లదీస్తున్నారని అన్నారు. ఆర్టిజన్లు కార్మికులుగా గుర్తింపబడినప్పటి నుంచి ఇప్పటివరకు పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతలను బట్టి ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 20వేల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎస్‌వీ.రావు, జంజిరాల వెంకన్న, గండమల్ల రాములు, మైనం ఊషయ్య, సందీప్ రెడ్డి, ఎం.రవి, మల్లేష్, నిర్మల, పెరిక శేఖర్, పెరుమళ్ల మురళి, జిట్టబోయిన లింగస్వామి, పోతేపాక విజయ్, లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, యూనిస్, జబ్బర్, ప్రవీణ్, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చింతపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వింజమూర్ పల్లెదవాఖానను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ అమీనా, యాస్మీన్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు చదివితే ఏదైనా సాధ్యం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దుగ్యాల ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదవితే ఏదైనా సాధ్యమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. 'బేటీ బచావో, బేటీ పడావో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆడపిల్లలు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చదువుతో కలిగే లాభాలేంటో విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాతీయ బాలికా దినోత్సవం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భ్రూణ హత్యలను నివారించడం, బాలికా విద్యను ప్రోత్సహించడం, మహిళా సాధికారత దిశగా అవగాహన కార్యక్రమాలు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్చి 8వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి మాట్లాడుతూ అమ్మాయిలపై వివక్ష చూపకుండా అన్ని రంగాల్లో సమానంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చింత కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి కృష్ణవేణి, జువైనల్ జస్టిస్ బోర్డు మెంబర్ మోహన్ రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ వెంకన్న, గర్ల్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి సరిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

(ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి): విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండలంలోని దుగ్యాలలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, హాస్టల్‌లో రూ.3.80లక్షల విలువైన రెండు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను, రూ.60లక్షలతో జంగిల్ క్లీనింగ్ పనులను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెండు నెలల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు మెరుగైన విద్యాబోధనకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి, మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నెర్మటి సతీష్‌రెడ్డి, తేరా సత్యనారాయణరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు పాదర్శకంగా అర్హుల ఎంపిక జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, మరిన్ని పథకాలు కూడా అమలుచేయనుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి, ఎంపీడీవో బాలరాజురెడ్డి, నాయకులు ఎంఏ.సిరాజ్‌ఖాన్, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, గంధం సురేష్, బక్కులు, మల్లేష్‌యాదవ్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ గ్రీవెన్స్

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నాగేశ్వర్‌రావు



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న నాగేశ్వర్‌రావు

నల్లగొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ గ్రీవెన్స్ చక్కని వేదిక అని కన్స్యూమర్ గ్రీవెన్స్‌సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ పి.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌లో వినియోగదారుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులు అపరిష్కృత సమస్యలపై ఫిర్యాదుచేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో ప్రతీ మూడు నెలలకు ఒకసారి గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఫైనాన్స్ రామాంజనాయక్, ఇండిపెండెంట్ మెంబర్ వెంకట ఎస్.కె.కె, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ అన్నయ్య, టెక్నికల్ ఏడీ నవీద్ అహ్మద్ పాల్గొన్నారు.

టెంటు పీకేసి, అధికారులను నిలదీసి

గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి నిరసన వెల్లువ •6లో..

చక్కదిద్దితే చూడముచ్చట

- ఉమ్మడి జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలు
- సినిమా చిత్రీకరణకు నెలవుగా రాచకొండ
- రాజుల వైభవానికి తార్కాణంగా దేవరకొండ ఖిల్లా, వాడపల్లి

•6లో..

దేవరకొండ రాళ్లతో తాజ్‌మహల్‌కు సొబగులు

- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



ఓటరూ.. శాసించు

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం •7లో..

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



యల్లాపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని యల్లాపురం గ్రామంలో రూ.10 లక్షలు, పెద్దగట్టు గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు పీఏపల్లి, వద్దిపట్ల గ్రామాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గ్రామ సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గ్రామసభలో దరఖాస్తు చేయనివారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి, మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, తేరా సత్యనారాయణరెడ్డి, సిరాజ్‌ఖాన్, గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, బోడియానాయక్ పాల్గొన్నారు.

దేవరకొండ డిపోలో డ్రైవర్స్ డే



డ్రైవర్లను సన్మానిస్తున్న డీఎం రమేష్‌బాబు, సీఐలు

దేవరకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డ్రైవర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు డ్రైవర్లకు గులాబీ పువ్వులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదరహిత డ్రైవర్లు కృష్ణారెడ్డి, వైవి.రెడ్డిలను సన్మానించారు. బ్రిలియంట్, గ్రామర్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీ లు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ సీఐ నర్సింహులు, బ్రిలియంట్ పాఠశాల నిర్వాహకులు విజయనిర్మల, తిరుపతి, ఆర్టీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తుల స్వీకరణ

డిండి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యాసంగి వ్యవసాయ పెట్టుబడి సహాయ పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏవో రెహానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2025 వరకు నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

చంద్రన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



చంద్రన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పున్న వెంకటేశ్వర్లు, వడ్త్య రమేష్‌నాయక్

దేవరకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన కార్మిక నాయకుడు, దేవరకొండ సర్పంచ్‌గా దివంగత హనుమంతు చంద్రన్న ఆశయ సాధనకు కృషి చేయాలని దేవరకొండ మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. దేవరకొండలో మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన హనుమంతు చంద్రన్న వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చంద్రన్న ఫౌండేషన్ పేరుతో చంద్రన్న కుమారులు హనుమంతు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్‌లు పేదలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రన్న ఫౌండేషన్ చైర్మన్ హనుమంతు వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, గెల్వయ్య, ఎస్ఎస్.చారి, తిరుపతయ్య, వివిధ పార్టీల నాయకులు, కార్మిక నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ఫుడ్ పాయిజన్ ఘటనతో ఇంటి నుంచే భోజనం



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థినులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్యాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకొని మధ్యాహ్నం తిన్నారు. శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం విద్యార్థులు మధ్యాహ్నం భోజనం టిఫిన్ బాక్స్‌లో తింటున్నారు. వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా గత డిసెంబర్ నెలలో ఫుడ్ పాయిజన్ కావడంతో అప్పటి నుంచి పాఠశాలలో భోజనం చేయాలంటే భయమవుతుందని, అందుకే చాలామంది ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్నామని విద్యార్థులు తెలిపారు. ఇదే విషయం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనయ్యను వివరణ కోరగా సరైన వివరణ ఇవ్వలేక పోయారు. పాఠశాల ఆవరణలోనే ఉపాధ్యాయుల గది ఎదుట ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లో విద్యార్థులు భోజనం తెచ్చుకుని తింటున్నా గమనించలేని స్థితిలో ఉపాధ్యాయులు ఉన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ధైర్యం చెప్పాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనుపమనరేందర్‌రెడ్డి

హాలియా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. అదే విధంగా ఎన్నెస్పీ కాల్వ వెంట దాతల సహకారంతో నిర్మించిన శివాలయం ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండి వారు స్వయంగా పూజలు నిర్వహిస్తూ ఆలయ ఆదాయాన్ని స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని ఎండోమెంట్ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ రామదుర్గారెడ్డి, వైస్ చైర్మన్ పిల్లి చంద్రకళ, ఫ్లోర్ లీడర్లు చింతల చంద్రారెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, నల్లబోతు వెంకటయ్య, శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్, పార్వతమ్మ, గౌని సుధారాణిరాజారమేష్‌యాదవ్, దీప్తి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకున్నాం

తమ పదవి కాలంలో వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకుని పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేసినట్లు మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా మునిసిపల్ చైర్మన్లు స్పష్టం చేశాం. మునిసిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం శనివారంతో ముగియనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో తమ అనుభవాలను వెల్లడించారు.

ప్రశ్నలు: 1. మీ పదవీ కాలం సంతృప్తినిచ్చిందా?
2. మీరు ఏం చేయాలనుకున్నారు. ఏం చేశారు.
3. మళ్లీ బరిలో ఉంటారా? ఈ సారి మీ ప్లానింగ్ ఎలా ఉండబోతుంది?
4. ప్రభుత్వం నుంచి మునిసిపాలిటీలకు ఎలాంటి తోడ్పాటు ఉండాలి?
5. ఈ ఐదేళ్లలో ఎదుర్కొన్న ప్రధాన సంఘటన, చేదు జ్ఞాపకం ఏమిటి?

అందరి సహకారంతోనే అభివృద్ధి

● తిరునగరు భార్గవ్, మిర్యాలగూడ



1. మౌలిక సదుపాయాల ఏర్పాటులో సఫలీకృతులమయ్యాం. అభివృద్ధి, ఆహ్లాదం కోసం చేపట్టిన పనులు సంతృప్తినిచ్చాయి. గతంతో పోలిస్తే పట్టణంలో పచ్చదనం పెరిగింది.

2. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి చర్యలు చేపట్టాం. పట్టణాన్ని చెత్త, ప్లాస్టిక్ రహితంగా చేయాలనుకున్నాం. చెత్త రహితంగా చేశాం. ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు కాలేదు.

3. ప్రజాసేవ చేసే భాగ్యం దేవుడిచ్చిన వరం. చిన్నతనం నుంచి ప్రజల మధ్యనే ఉన్నా. భగవంతుడి కృప, పార్టీ నిర్ణయంతోనే భవిష్యత్ ప్లానింగ్ ఉంటుంది.

4. మునిసిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వాలు స్పెషల్ గ్రాంట్స్ ఇవ్వాలి. పాలకవర్గానికి ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించాలి.

5. పాలన చేపట్టిన వెనువెంటనే కరోనా దాపురించింది. ఐదేళ్లలో తొలి రెండేళ్లు కరోనా కష్టకాలంలో గడవగా ప్రస్తుతం ఏమీ చేయలేని పరిస్థితి. గ్రేడ్-1గా ఎదిగిన మిర్యాలగూడ మునిసిపాలిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించడం ప్రజలు ఇచ్చిన వరం.

- మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి

దీర్ఘకాలిక పనులను పూర్తి చేశా

● ఆలంపల్లి నర్సింహ, దేవరకొండ



1. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్వర్ణముఖి కాల్వను రూ. 2కోట్లతో నిర్మించాం. ఎమ్మెల్యే బాలు నాయక్ సహకారంతో రూ.60 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఖిల్లాలోని పార్కు, రోడ్ల నిర్మాణం చేపట్టాం.
2. దేవరకొండను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి నా వంతు ప్రయత్నం చేశా. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేశాను.
3. రిజర్వేషన్లు అనుకూలించి పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తా. ఐదేళ్లలో ఎమ్మెల్యే బాలు నాయక్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో అభివృద్ధికి కృషి చేశా.
4. మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి మంచి తోడ్పాటు లభిస్తుంది. ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తుంది.
5. కరోనా సమయంలో కొంత ఇబ్బంది ఏర్పడింది. అయినప్పటికి ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో మున్సిపాలిటిలో సమస్యల పరిష్కారానికి కృషి చేశా. సమీకృత కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఉన్నప్పటికి స్థలం లేకపోవడంతో చేయలేకపోయానని కొంత బాధగా ఉంది.

-దేవరకొండ, ఆంధ్రజ్యోతి

మళ్లీ అవకాశం వస్తే మరింత అభివృద్ధి

● యడవెల్లి అనుపమానరేందర్‌రెడ్డి, హాలియా



1. చైర్‌పర్సన్‌గా 10 నెలల కాలమే పని చేసినా నేను చేసిన పని సంతృప్తినిచ్చింది.
2. మున్సిపాలిటీని ఎంతగానో అభివృద్ధి చేయాలనుకున్నా, నేను ఉన్న సమయంలోనే అమృత్ పథకం కింద రూ. 15.2 కోట్లు, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సహకారంతో మంజూరు చేయించాను. ఆ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
3. అధిష్టానం అవకాశమిస్తే మళ్లీ బరిలో ఉండాలనే ఆలోచన ఉంది. మునిసిపాలిటీ మరింత అభివృద్ధికి తోడ్పడతాను.
4. కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపాలిటీలకు తోడ్పాటును అందించింది. ఐదేళ్లుగా స్టాంప్ డ్యూటీ, జనరల్ ఫండ్ మునిసిపాలిటీలకు ఇవ్వకున్నా రేవంత్ ప్రభుత్వం వాటిని హాలియా మున్సిపాలిటీకి సుమారు రూ.2.4 కోట్లు విడుదల చేసింది. వాటిని వినియోగించే సమయం లేకున్నా మౌలిక వసతుల కల్పనకు తోడ్పడుతుంది.
5 నాలుగేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ కౌన్సిలర్లను అభివృద్ధికి దూరంగా ఉంచడం చేదు అనుభవం. వారి పాత్ర మేము పోషించకుండా కొంతలో కొంత అయినా కౌన్సిలర్లకు న్యాయం చేశాను.

- హాలియా, ఆంధ్రజ్యోతి

ఆందోళనల నడుమ ముగిసిన గ్రామసభలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేయడానికి నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభలు ఆందోళన నడుమ ముగిశాయి. అర్హుల జాబితా తప్పులతడకగా ఉందని, జాబితాలో అర్హుల పేర్లు లేవని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామసభల్లో అధికారులు జాబితాలో అర్హుల పేర్లు చదివి వినిపిస్తుండగా ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, అర్హులకు పథకాలు ఎందుకు ఇవ్వరని అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేని వారు నిరాశ చెందవద్దని, పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● మిర్యాలగూడ పట్టణంలోని సాయినగర్‌లో నిర్వహించిన గ్రామసభలో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. గ్రామసభలో దరఖాస్తు ఇవ్వలేకపోయినా మునిసిపల్ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. 37 నుంచి 48వ వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ పాల్గొన్నారు.

● దామరచర్ల మండంలోని దామరచర్ల, శాంతినగర్ గ్రామపంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభలో అర్హుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. కార్యక్రమంలో పీఎస్ నవీన్, ఏపీఎం దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● హాలియా మునిసిపాలిటీలోని 4,8,12వ వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యడవల్లి నరేందర్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, పోదిల కృష్ణ, నెర్మటి వెంకట్‌రెడ్డి, కాతోజు ఎల్లయ్యచారి, గోవింద్, మట్టారెడ్డి, మజారుద్దీన్, నసీరుద్దీన్, అన్వర్ పాల్గొన్నారు.

● డిండి మండలంలోని కందుకూరు గ్రామంలో గ్రామసభలో అనర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. జాబితాలో ఉన్న అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● నిడమనూరు మండలంలోని గుంటుకగూడెం, గుంటిపల్లి, ఊట్కూరు, నందికొండవారిగూడెం, రేగులగడ్డ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అర్హుల జాబితా తప్పులతడకగా ఉందని, జాబితాలో అర్హుల పేర్లు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామసభల్లో ఏవో మునికృష్ణయ్య, ఏఈపీఆర్ సాయిప్రసాద్, ఎంఈవో వెంకన్న, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకన్న, ఆర్ఐ పాల్గొన్నారు.

● దేవరకొండ పట్టణంలోని 16, 20వ వార్డుల్లో జరిగిన ప్రజాపాలన వార్డు సభలలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ పాల్గొని మాట్లాడారు. పథకాల కోసం దరఖాస్తులు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. ఈ సభలలో మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, కౌన్సిలర్లు కొండ్ర మల్లేశ్వరి, శ్రీధర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల, కుర్మపల్లి, రోటిగడ్డ తండా, వెంకటంపేట(తీదేడు), మల్లారెడ్డిపల్లి, చింతపల్లిలో అధికారులు గ్రామసభలు ఏర్పాటు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జర్పుల పద్మ, అంగిరేకుల గోవర్ధన్, భాస్కర్, జగదీష్, ఖలీల్ పాల్గొన్నారు.



గుర్రంపోడు : చామలేడులో అధికారులతో వాగ్వివాదానికి దిగిన గ్రామస్థులు

● గుర్రంపోడు మండలంలోని చామలోనిబావి, కాచారం, వట్టికోడు, పల్లెపహాడ్, లక్ష్మీదేవిగూడెం, సుల్తాన్‌పురం, తానేదారుపల్లి, చామలేడు, కోతులాపురం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. చామలేడులో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

● వేములపల్లి మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ పుష్పలత పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, సీపీఎం నాయకులు లబ్ధిదారుల జాబితాను ఇదే గ్రామసభలో ఎంపిక చేసి ప్రకటించాలని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని ప్రతివాదనకు పూనుకోగా గ్రామసభ రసాభాసగా కొనసాగింది. ఈ సమయంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని ఇరుపక్షాలకు సర్దిచెప్పడంతో గ్రామసభ సాఫీగా కొనసాగింది. అదేవిధంగా కామేపల్లి, తిమ్మారెడ్డిగూడెంలో సైతం నిర్వహించిన గ్రామసభలో ఇలాంటి పరిస్థితుల నడుమే సభలు ముగిశాయి. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, ఎంపీవో లలిత, డీటీ కోటేశ్వరి, ఆర్ఐ స్పందన, ఏవో కిశోర్‌నాయక్ పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి ఉమ్మడి మండలంలోని 31గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లకు 1522, రైతు భరోసా 242, కొత్త రేషన్‌కార్డులు 1624, ఆత్మీయ భరోసా 595, మొత్తం 3983 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో అయా గ్రామసభలో ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్లు మధుహాసిని, శ్రీనివాస్‌రావు, ఎంఈవో వెంకటయ్య, శ్రీనయ్య, ఏవో పాండు, ఏఈవోలు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల, గుర్రప్పగూడెం, చిరుమర్తి, పాములపాడు, బీమనపల్లి, తోపుచర్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమలస్వామి, అధికారులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ, డిండి, హాలియా, వేములపల్లి, చింతపల్లి, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు కష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. దేవరకొండలో గ్రామ్య ఎన్జీవో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యను అభ్యసించడానికి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని, తక్కువ ఖర్చుతో కూడా ఉన్నత చదువులు చదువుకోవచ్చని అన్నారు. బాల్యవివాహాలు నేరమని, వాటిని అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ్య ఎన్జీవో నిర్వాహకురాలు డాక్టర్ రుక్మిణిరావు మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతంలో గతంలో శిశు విక్రయాలు, బాల్య వివాహాలు అధికంగా జరిగేవని, గ్రామ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ శాఖ నిర్వాహకులు సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● డిండి మండలంలోని కాల్యతండాలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సాయిబాబు పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు, శిశు విక్రయాలు గురించి తెలిస్తే 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, మోడల్‌స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో వెంకన్న, సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, సత్యవాణి, లావణ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

● చింతపల్లి మండలంలోని గొల్లపల్లి, చాకిలిశేరుపల్లి, బోటిమీది తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు అందరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, పుష్పలత, వసంత, షాహీం తదితరులు పాల్గొన్నారు.

● హాలియా, వేములపల్లి, అడవిదేవులపల్లి, మండల కేంద్రాల్లోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.సరిత, రజిని, నాగరాణి మాట్లాడుతూ ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలను సాధించాలని సూచించారు. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. బాలికలందరూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు రమేష్, వరలక్ష్మి, ఉపాధ్యాయురాలు నర్మద, అండాలు, ఉపాధ్యాయులు యాదమ్మ, శాంతకుమారి, వాణిశ్రీ, నాగమణి, నాగశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, శశికళ పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు లక్ష్మి, నాగమణి, రజిని మాట్లాడుతూ విద్యార్థినులకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్లను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో వసంతకుమారి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

పెద్దవూర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక వైఖరిని అవలంబిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతూ పేదలపై ధరల భారాన్ని మోపుతుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. వీటన్నింటినీ మహాసభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, నాయకులు తరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి: పోలేపల్లి వాగు నుంచి దేవరకొండ మీదుగా కొండమల్లేపల్లికి తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గణతంత్ర పరేడ్‌కు విద్యార్థుల ఎంపిక

నాగార్జునసాగర్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొనేందుకు సాగర్ బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ విభాగంలో పరేడ్‌లో పాల్గొనేందుకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఎం.స్వామి. కె. శరత్‌చంద్ర, ఎన్.నవీన్ హైదరాబాద్‌లో గణతంత్ర పరేడ్‌లో పాల్గొంటారని తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పెద్దవూర:మండలంలోని పూల్యాతండా ఎంపీపీఎస్‌లోని విద్యార్థులకు గ్రామానికి చెందిన సీతారాంనాయక్ సౌజన్యంతో క్రీడా దుస్తులు, పరీక్ష ప్యాడ్లను హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో తరి రాము ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం. చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రతేజకు సీఎల్పీ మాజీ నేత నివాళి

హాలియా: అనుముల మండలం పంగవాని కుంటతండా గ్రామానికి చెందిన బేగంపేట్ డీసీపీ వెంకటేశ్వర్లు కుమారుడు చంద్రతేజ వర్ధంతి సందర్భంగా సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాటుసారా విక్రయిస్తే పీడీ యాక్టు

శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, దేవరకొండ



నాటుసారా విక్రయిస్తూ రెండు సార్లు పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటుసారా అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో నాటు సారా అరికట్టడానికి దేవరకొండ ఎక్సైజ్ పోలీసులతో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గతేడాది ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు?

సీఐ: 2024 జనవరి నుంచి నేటి వరకు దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 605 కేసులు నమోదు చేసి 332 మందిని అరెస్ట్ చేశాం. 1819.75 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నాం. 22417 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని ఏడు వాహనాలను సీజ్ చేశాం.

ఆంధ్రజ్యోతి: నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం పౌడర్, పటికను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: బీదర్, హైదరాబాద్ పటాన్ చెరువు నుంచి నల్లబెల్లం పౌడర్, పటిక దేవరకొండ ప్రాంతానికి అధికంగా రవాణా అవుతుంది. ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసి నల్లబెల్లం పౌడర్, పటిక స్వాధీనం చేసుకొని వాహనాలను సీజ్ చేస్తూనే ఉన్నాం. ఎక్సైజ్‌శాఖ నాటుసారాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించింది.

ఆంధ్రజ్యోతి: దేవరకొండతో పాటు గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టుషాపుల మాటేమిటి?

సీఐ: బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలి. దాడులు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేస్తాం.

నేడు మునిసిపల్ కౌన్సిల్ చివరి సమావేశం

మిర్యాలగూడ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ చివరి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. చైర్మన్ భార్గవ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు. పట్టణ అభివృద్ధితో పాటు కార్మికుల వేతనాలు తదితర అంశాలపై కౌన్సిల్‌లో చర్చించనున్నట్లు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం

తిరుమలగిరి(సాగర్), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నాట్కో ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ ఫర్హాత్ అన్నారు. నాట్కో ట్రస్ట్, ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నెల్లికల్లులో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండలాలలోని సుమారు 20 గ్రామాలకు చెందిన 80మంది మహిళలు గర్భకోశ, రొమ్ము క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ ముందస్తుగా క్యాన్సర్‌ను నిర్ధారిస్తే చికిత్స ద్వారా నయమవుతుందని అన్నారు. మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కోఆర్డినేటర్ సర్వేశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు వైద్యులు నిఖిల్, కిరణ్, నాట్కో ట్రస్ట్ డిప్యూటీ మేనేజర్ సూర్యనారాయణ, పేషెంట్ కౌన్సిలర్లు శిల్ప, సుధ, ప్రేరణ, నాగమణి, చీనా పాల్గొన్నారు.

'అర్హులకు ప్రభుత్వ పథకాల్లో మొండిచేయి'

వేములపల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రభుత్వం గత పాలకుల మాదిరిగానే మొండి చేయి చూపిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అధికార యంత్రాంగం ఆ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అర్హుల ఎంపిక విషయంలో పారదర్శకత పాటించడం లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెగాని సైదులు, మల్లేష్, రాము, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.